102218

DEPT. OF INFORMATION & PUBLIC RELATIONS
GOVT. OF ANDHRA PRADESH, HYDERABAD.
NEWS PAPER RECORDS
FILE COPY

సంపుటం 11 సంచిక 222

గోలకొండపత్రిక

రిజిష్టర్ హెచ్ నెం 45 స్థాపితం 1925

7—7—1958 హైదరాబాదు సోమవారం

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి ఎం. ఏ.

4 పేజీలు 7 నయాపైసలు

నేడేలండన్‌లో ఇండో-పాక్ ప్రతినిధుల చర్చలు

బొంబాయి, జూలై 6: ఇండియా – పాకిస్తాన్ కాలువ నీటి వివాదం సందర్భంగా రేపు లండన్‌లో జరుగనున్న సమావేశంలో పాల్గొనే నిమిత్తం భారత ప్రతినిధివర్గం నేటిరాత్రి విమానంలో లండన్ బయలుదేరింది. కేంద్ర ప్రభుత్వం ఇరిగేషన్ శాఖ కార్యదర్శి ఎన్. డి. గులాటి నాయకుడుగాగల ఈ ప్రతినిధివర్గంలో మల్ హోత్ర, కాల్లా, బర్కత్ రాంకూడ ఉన్నారు. పదేండ్లగా ఉన్న ఈ వివాద పరిష్కారానికి ప్రపంచ బ్యాంక్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నది. 1962 తరువాత పాకిస్తాన్‌కు నీటిని సరఫరా చేయలేమని ఇండియా పేర్కొన్నది. లండన్‌లో ఈచర్చలు రెండు వారాలు కొనసాగవచ్చు.

తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపి అవసరం

హైదరాబాద్, జూలై 6: తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపి ఉండాలని సూచిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించిన తరువాత మైసూరు రాష్ట్రం వెలుపలగల కన్నడిగుల 12వ సమ్మేళనం నేడు ముగిసింది. రాజ్యసభ ఉపాధ్యక్షుడు శ్రీ ఎస్. వి. కృష్ణమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఏక లిపి ఏర్పాటువలన ఆంధ్రులు, కన్నడిగుల ఐక్యతకు, అభివృద్ధికి దోహదం చేయునని ఆ తీర్మానం పేర్కొన్నది. రాష్ట్రం వెలుపలఉన్న కన్నడిగులు కన్నడ రాయబారులుగా ఆయా ప్రాంతాలలో స్నేహభావంతో వ్యవహరించాలని కోరుతూ సమ్మేళనం మొత్తం 6 తీర్మానాలు చేసింది. ఆహ్వాన సంఘాధ్యక్షుడు మాధవరావు అన్వారి వందన సమర్పణం చేశారు.

దేశంలో ప్రమాదకరమైన కొత్తరకం కులతత్వం వ్యాపిస్తున్నది

ప్రజలకు రాజాజీ హెచ్చరిక

సంకుచిత రాజకీయముఠాలు యితర వర్గాల్ని చేరనీయక ఏకాకిగా ఉండటంతో కొత్త రకం అస్పృశ్యత ఏర్పడగలదని వివరణ

మద్రాస్, జూలై 6

మత సమ్మేళనాలపై ఏర్పడిన కులతత్వానికంటె హీనమైన ఒక కొత్త రకం కులతత్వం బయలుదేరిందనీ, దానివలన దేశానికి చాల హాని ఉన్నదనీ శ్రీ సి. రాజగోపాలాచారి నేడు హెచ్చరించారు.

ఈకొత్త రకం కులతత్వం సముచిత రాజకీయ ముఠాలపై ఆధారపడినదనీ, ప్రతి ముఠా యితర ముఠాలతో సంబంధాల్ని నిరాకరిస్తుందనీ ఆయనన్నారు. ఈవిధంగా ప్రతి ముఠా ఏకాకిగాఉండటం వలన కొత్త రకము అస్పృశ్యత ఏర్పడగలదన్నారు.

నేటి సాయింత్రం యిక్కడొక బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రాజాజీ స్టాక్‌హోం శాంతి ప్రతిపాదనల్ని బలపర్చడానికే తానూ, కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ఒకే వేదికనుండి ప్రసంగించడాన్ని రాజాజీ సమర్థించారు.

అణుప్రయోగాలకు వ్యతిరేకంగా మొత్తం ఆసియా ప్రజాభిప్రాయాన్ని క్రోడీకరించాలనీ, అప్పుడు అమెరికా, యితర పశ్చిమరాజ్యాలు జాగ్రత్తపడుతాయనీ రాజాజీ అన్నారు.

కమ్యూనిస్టులుకూడ అణుప్రయోగాల నిలుపుదలను బలపరుస్తున్నారనీ, అలాంటప్పుడు తాను నంబూద్రిపాద్‌తో ఒకే ప్లాట్‌ఫారంపై మాట్లాడటం గురించి పత్రికలలో విమర్శలు రావలసిన పని లేదనీ రాజాజీ అన్నారు. మనం భిన్నించేవారు మనవలె ఆలోచిస్తే, మంచి విషయాలు ఒక్కసారే ఎలా చెడువిషయాలవుతాయని ఆయన ప్రశ్నించారు. 'మనం కులాల్ని నిషేధించాలంటాము, కాని కొత్త రకము రాజకీయ కులాలు ఏర్పడుతున్నవి. ప్రతి రాజకీయ ముఠా ఒక కులము. ప్రజలు యీ కొత్త కులాలుగా విభజించబడే ప్రమాదంఉంది' అని ఆయన అన్నారు.

జూలై 10 న రాష్ట్రపతి సింగరేణి సందర్శన

జూలై 17 వరకూ నగరంలో మకాం

హైదరాబాద్, జూలై 6

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ జూలై 10 వ తేదీన సింగరేణి కాలరీలను సందర్శిస్తారు. రాష్ట్రపతి కాలరీల పనిచేసే విధానాన్ని పరిశీలించి బొగ్గుగని కార్మికుల్ని కలుసుకొంటారు. సింగరేణి నుండి కొత్త గూడెం వెళ్ళి అక్కడి నుండి భద్రాచలం దేవాలయం సందర్శించి జూలై 12 న రాష్ట్రపతినిలయానికి తిరిగి వస్తారు. జూలై 9వ తేదీన భువనగిరి తాలూకాలోని యాద్గిరిగుట్టను సందర్శిస్తారు. జూలై 17 వరకూ ఆయన రాష్ట్రపతి నిలయములో ఉంటారు.

అధికోత్పత్తికి పార్టీ ప్రమేయంలేని కృషి

జరగాలని శ్రీ జైన్‌కు కిసాన్ సభ సూచన

హైదరాబాద్, జూలై 6

కమ్యూనిస్టుల ఆంధ్రప్రదేశ్ కిసాన్ సభ కేంద్ర ఆహార,వ్యవసాయ మంత్రి శ్రీ అతుల్‌ప్రసాద్ జైన్‌కు ఒక మెమోరాండంను సమర్పిస్తూ కౌలుదార్లు పెద్ద యెత్తున బేదఖలీ చేయబడుతున్నారనీ, రాష్ట్రప్రభుత్వము బంజరు భూముల్ని భూములు లేని వారికి పంపిణీ చేయడంలో శ్రద్ధ వహించడంలేదనీ పేర్కొన్నారు.

రాష్ట్రప్రభుత్వ భూ సంస్కరణల బిల్లు ప్రజాభిప్రాయానికి అనుకూలముగా లేకున్నా, ప్లానింగ్ కమీషన్ దాన్ని ఆమోదించడంపట్ల ఆ మెమోరాండం ఆశ్చర్యాన్ని ప్రకటించి విప్లవాత్మకమైన భూసంస్కరణలు కావాలని కోరింది.

ఉత్పత్తిని హెచ్చించడానికి పార్టీ ప్రమేయంలేని కృషి జరగాలనీ, తాలూకా స్థాయిలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సమావేశాలు జరగాలనీ ఈ మెమోరాండం కోరింది. దీనిపై కిసాన్ సభ కార్యదర్శి శ్రీ వై. వి. కృష్ణారావు, శ్రీ వెల్లంకి విశ్వేశ్వరరావు, ఎం. ఎల్. ఏ. శ్రీ కె. ఎల్. నరసింహారావు, ఎం. ఎల్. ఏ. సంతకం పెట్టారు.

విధానపరిషద్ధ్యక్షతకు శ్రీ మాడపాటి

గడువులోపల వేరేనామినేషను రానందున కాంగ్రెసు అభ్యర్థిగా ఆంధ్రపితామహుని ఎన్నిక

ఉపాధ్యక్ష పదవికి శ్రీ జి. సుబ్బరాజు

హైదరాబాదు, జూలై 6

ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు అధ్యక్ష పదవికి తమ అభ్యర్థిగా కాంగ్రెస్ శాసన సభా పార్టీ ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు గుణగణములను సేవాత్యాగాలను అభినందిస్తూ మాట్లాడారు. ఉభయ సభల్లోనూ ఆయనే వయోవృద్ధులు. ఆయనకు 1956లో రాష్ట్రపతి పద్మభూషణ బిరుదునిచ్చారు.

శ్రీ మాడపాటి

అధ్యక్షపదవికి నామినేషన్లు చేరవలసిన గడువు యీవేళ మధ్యాహ్నం 12 గంటలు. ఈలోగా మరో నామినేషన్ రానందున శ్రీ మాడపాటి హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు రేపు ప్రకటింప బడుతుంది.

రేపు ఉదయం కౌన్సిల్ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. తదనంతరం అధ్యక్షుఎన్నిక జరుగుతుంది. రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ రేపు సాయంత్రం విధాన పరిషత్తుమ ప్రారంభిస్తారు.

విధానపరిషత్తు అధ్యక్షపదవికి అభ్యర్థిగా శ్రీ హనుమంతరావు పేరును వి. సి. సి. అధ్యక్షుడు శ్రీ పి. రంగారెడ్డి ప్రతిపాదించగా ఇరిగేషన్ మంత్రి శ్రీ కె. వి. నరసింగరావు బలపరిచారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు గుణగణములను సేవాత్యాగాలను అభినందిస్తూ మాట్లాడారు. ఉభయ సభల్లోనూ ఆయనే వయోవృద్ధులు. ఆయనకు 1956లో రాష్ట్రపతి పద్మభూషణ బిరుదునిచ్చారు.

.....

నిజాయితీ అవసరం

డా॥ రాజేంద్రప్రసాద్ ఉద్బోధ

హైదరాబాద్, జూలై 6

పరస్పర విరుద్ధమయిన క్లెయిములు అభిప్రాయాల మధ్య సర్దుబాటు జరుగాలి. ఏ సమస్యగానీ న్యాయంగా సముచితంగా పరిష్కారం. కావాలంటే ఉన్నతస్థాయి సమీకృతస్థితి అవసరం అని రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ నిన్న సాయంత్రం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి విద్యార్థులు–ఉద్యోగుల సమావేశంలో ప్రసంగిస్తూ ఉద్ఘాటించారు

రోజూ పత్రికల్లో ఆ ఫ్యాక్టరీలో సమ్మె జరుగుతున్నది. లేదా మరో ఫ్యాక్టరీలో సమ్మె జరుగుతున్నది అదీ కాకపోతే ప్రభుత్వ శాఖల్లో సమ్మె జరుగుతున్నది అని వార్తలు చదువుతుంటాం. వారి అవసరాల్ని తీర్చవలసిందిగా వారు డిమాండు చేస్తుంటారు. ఈ సమస్యలను సమీకృత స్థితిలో ఆలోచించి నిజాయితీతో సర్దుబాటు చేసుకుంటూ రావాలిఅని డా॥ రాజేంద్రప్రసాద్ అన్నారు. అన్నిటికన్న సమీకృతస్థితి, నిజాయితీముఖ్యమంటూ శ్రీ ప్రసాద్ మన దేశంలో మనం అందరం బ్రహ్మాండమైన సమాజాన్ని నిర్మించుకుంటున్న ఈతరుణంలో నిజాయితీకి ఉన్న ప్రాధాన్యం మరోదానికి లేదన్నారు. గత ప్రపంచయుద్ధం తరువాత నిజాయితీ లోపించిందని ప్రజలంటూఉంటారు. ప్రజల మనస్తత్వమే అలా ఉంది కనుక నిజాయితీ లేమి తప్పనిసరి అని కొందరు సరిపుచ్చుకొంటారు. ఏమైనా ఉన్నత పదవుల్లో వున్నవారు నిజాయితీతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. ఇందువల్ల వారితో పనిచేసే వారి యందు నైతికస్థాయి పెంపుదల పొందే అవకాశం ఉంటుంది అని శ్రీ ప్రసాద్ ఉద్బోధించారు.

వివిధ పరిపాలనా విభాగాలను పరిశ్రమలను ఎదుర్కొంటున్న వివిధ సమస్యలున్నాయనీ,వీటిని పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి మేధా సంపత్తి మాత్రమే కాక సమీకృతస్థితితో ఆలోచించి పనిచేస్తూ ఉన్నత పదవికి అనుగుణంగా ప్రవర్తించగల శాహతు ఇతరులపై ప్రభావం వేయగల శక్తి ఉండాలనీ, ఇదంతా పైకి కనిపించే వ్యవహారం కాకపోయినా అనుభవనీయమనీ డా॥ ప్రసాద్ అన్నారు,

కాలేజి ప్రిన్సిపాల్ జనరల్ శ్రీ నగేశ్ రాష్ట్రపతికి స్వాగత మిచ్చారు.

డల్లెస్ ప్యారిస్ ప్రయాణం

డిగాలీతోచర్చల అనంతరం

ప్యారిస్, జూలై 6

ఫ్రాన్స్‌కు అణ్యస్త్రములు తయారుచేసే శక్తి నార్జించడానికి తాను నిశ్చయించు కున్నట్లు ఫ్రెంచి ప్రధాని షార్లెస్ డిగాలీ అమెరికా స్టేట్ సెక్రటరీ జాన్ ఫాస్టర్ డల్లెస్‌కు స్పష్టంగా చెప్పాడట.

డల్లెస్ నిన్న రెండున్నర గంటల సేపు డిగాలీతో చర్చించాడు. తరువాత మధ్యాహ్న భోజనం జరిగింది. మళ్లీ మధ్యాహ్నం డల్లెస్ ముప్పావు గంటసేపు డిగాలీతో చర్చించాడు.

పరస్పరం అభిప్రాయాలు తెలుసుకోడానికే డల్లెస్– డిగాలీ చర్చలు జరిగాయి కాని ప్రత్యేకఉద్దేశాలతోనూ చర్చలు జరుగలేదని తెలుస్తున్నది కాగా నిర్ణయాలేమీ తీసుకోబడలేదు.

నిన్నటితోనే డల్లెస్–డిగాలీచర్చలు ముగిసి డల్లెస్ తిరిగి వాషింగ్‌టన్ వెళ్ళిపోయాడు. ఆతడు తనవెంట ఐసెన్‌హోవర్‌కు డిగాలీ ఇచ్చిన సందేశాన్నికూడా కొంపోయి అందజేశాడు.

బెర్లిన్ మహాసభకు కృశ్చేవ్ ప్రయాణం

మాస్కో, జూలై 6

జూలై 10 నుండి 16 వరకూ బెర్లిన్‌లో జరగనున్న తూర్పు జర్మనీ ఐక్య సోషలిస్టుపార్టీ ఐదవ మహాసభలో పాల్గొనడానికి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రధాని కృశ్చేవ్ నాయకత్వములో ఒక ప్రతినిధివర్గం బెర్లిన్ వెళ్తుందని నేడు "ప్రావదా" వ్రాసింది. తూర్పు జర్మనీలోని రష్యా రాయబారి పెర్వుఖిన్, అనేకమంది ప్రాంతీయ పార్టీ కార్యదర్శులు కృశ్చేవ్ వెంట ఉంటారు.

విధాన పరిషత్తులో కాంగ్రెసు బలం 41 నుండి 48కి పెంపు

హైదరాబాద్, జూలై 6

ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తులోని కాంగ్రెసు సభ్యులసంఖ్య 41 నుండి 48కి పెరిగింది.

నేడు 7 గురు కొత్తగా కాంగ్రెసు శాసనసభ పార్టీలోకి చేర్చుకోబడ్డారు. వారిలో 5 గురు గవర్నరు నామినేటు చేసినవారు, ఇద్దరు పట్టభద్రుల నియోజకవర్గంనుండి గెల్చినవారు.

నేడు కాంగ్రెసు శాసనసభ పార్టీలో చేరిన కౌన్సిల్ సభ్యులపేర్లు ఇవి: జి. సుబ్బరాజు, పెమ్మరాజు వెంకట్రావు, బిక్కిన వెంకట రత్నం, కడప రామ సుబ్బమ్మ, ఇల్లిందల సరస్వతి దేవి, ఎస్. వెంకట సుబ్బయ్య, ఎస్, వి. పి. సత్యనారాయణరావు.

దేశాభ్యున్నతికి కాయకష్టం చేయాలి

యువతీ యువకులు ఒక సంవత్సరం అయినా చేయాలనీ, అదివారికే మంచిదనీ శ్రీ నెహ్రూ

న్యూఢిల్లీ, జూలై 6

ప్రధాని నెహ్రూ నేడు తన యింటికి వచ్చిన 55 మంది సంఘ సేవా శిబిర శిక్షితులైన మహిళల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ యువజనులు ఒక సంవత్సరం అయినా కాయకష్టం చేయాలని ఉద్బోధించారు.

ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షార్ జిల్లా ఖుర్ గ్రామంలో భారతసేవక సమాజం నిర్వహిస్తున్న ఆ శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఈ మహిళలు తమ 21రోజుల శిక్షణనుముగించుకొన్నారు.

దేశనిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని శ్రీ నెహ్రూ అన్నారు. కాయకష్టంద్వారానే దేశము పురోగమించ గలదన్నారు. ప్రతి ఒక్కరూ పటాటోపాలకుపోక దేశ ప్రయోజనాలకు హృదయపూర్వకముగా పనిచేయాలి. దేశంలోని యువతీయువకులంతా అధమం ఒక సంవత్సరమైనా కాయకష్టం చేయాలి. అది వారికెంతో ప్రయోజనకరం. కాయకష్టం మానసికమైన పనికంటె తక్కువ అనుకోడం పొరబాటు. తాముచేసే పనిని ఉత్సాహంతో, ఉత్తేజంతో చేయాలి.

తాను యిటీవల మనాలికి వెళ్ళడాన్ని ప్రస్తావించి ఆ విశ్రాంతి ఎంతో బాగున్నదనీ, అవకాశంఉంటే అంతా అలాంటి ప్రదేశాలకు వెళ్ళాలనీ నెహ్రూ అన్నారు. వాటివలన చాల నేర్చుకోగలరన్నారు

హనుమంతరావు కమిటీ నివేదికను వెంటనే ప్రకటించాలి

లేకుంటేఅమరణదీక్షపూనగలనని శ్రీ జి. వెంకటస్వామి ప్రకటన

హైదరాబాద్, జూలై 6

ఐ. ఎన్. టి. యు. సి. హైదరాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. వెంకటస్వామి, ఎం. ఎల్. ఏ. హనుమంతరావు వేతనాల కమిటీ నివేదికను ప్రభుత్వం ప్రకటించడంలో జాప్యం చేస్తే, ఆమరణ నిరాహారదీక్షను బూనగలననినేడుప్రకటించారు.

సాధారణ సమ్మె సమయంలో 1954 లో పూర్వ హైదరాబాదు ప్రభుత్వం ఈ కమిటీని నియమించినది. ఈ నివేదికను ప్రస్తుతం ప్రభుత్వము పరిశీలిస్తున్నది.

శ్రీ వెంకటస్వామి ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డికి నిన్న ఒక మెమోరాండంను సమర్పిస్తూ ఈ నివేదికను ప్రచురించడంలో జాప్యం చేయడము కార్మిక వర్గంలో అశాంతిని పెంపొందిస్తున్నదన్నారు. కార్మికవర్గం పట్ల పట్టనట్లుగా ప్రభుత్వం వ్యవహరించరాదని ఆయన పేర్కొన్నారు.

ఇందిరాగాంధీ, కమలాదేవిలరాక

హైదరాబాద్, జూలై 6

శ్రీమతి ఇందిరాగాంధీ రేపు ఢిల్లీ నుండి విమానంలో హైదరాబాద్ వస్తున్నారు. ఆమెకు బేగంపేట విమానాశ్రయంలో ఘనమైన స్వాగతమివ్వబడుతుంది.

అఖిల భారత చేతివృత్తులబోర్డు అధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవి ఛట్టోపాధ్యాయకూడ రేపుమద్రాసు నుండి విమానంలో వస్తున్నారు.

అమెరికాచే మరో అణుప్రయోగం

వాషింగ్టన్, జూలై 6

అమెరికా మళ్ళీ అణుప్రయోగం జరిపింది. పసిఫిక్ సముద్రంలో జరిపిన ఈ అణుప్రయోగం అమెరికా జరిపినవాటిలో 12వది. దీనిని గురించి వివరాలు తెలియడంలేదు.

గమనిక

సికింద్రాబాద్ "మహాంకాళి జాతర" కారణంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున రేపటి పత్రిక వెలువడదు.

గో. ప. మే.

పార్టీ క్రమశిక్షణను నేను ఉల్లంఘించలేదు

నీలకంఠేశ్వరమ్మ వివరణ

హైదరాబాదు, జూలై 6

ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ సభ్యురాలు శ్రీమతి కొమ్మారెడ్డి నీలకంఠేశ్వరమ్మ ఒక ప్రకటనలో తాను కాంగ్రెసుపార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించలేదనీ, అందువలననే స్వతంత్రంగా పోటీచేసి గెలిచే అవకాశం తనకున్నా గడువులోపలనే నామినేషన్ ప్రకటనను ఉపసంహరించుకొన్నానని పేర్కొన్నారు.

కాంగ్రెసు టికెట్‌కై దరఖాస్తు చేసినానని, కాని పి-సి-సి ఎన్నికల కమిటీ తొలి ఎంపికలో మహిళలు యిద్దరే ఉన్నందున మహిళలకుప్రాతినిధ్యం సరిపోదని అధిష్ఠానవర్గానికి వ్రాయగా ఈవిషయాన్ని పరిశీలించమని కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణకు జూన్ 9 వ తేదీన అధిష్ఠానవర్గ నాయకులు లేఖ వ్రాస్తూ తనకూ ఒక ప్రతిని పంపించారనీ, అది 11 వ తేదీన తనకందినందున 12వ నామినేషన్ వేశానని పేర్కొన్నారు. తరువాత మరో యిద్దరు మహిళల్ని అభ్యర్థులుగా నిలిపినందున తాను ఉపసంహరించుకొన్నానని పేర్కొన్నది.

ఆంధ్రప్రదేశ్‌లో కన్నడిగుల ప్రయోజనాలు

పూర్తిరక్షణ ఇవ్వబడగలదని ముఖ్యమంత్రి వివరణ

హైదరాబాద్, జూలై 5

12 వ హోర్నాడ కన్నడిగ సమ్మేళనానికిప్రారంభోత్సవంచేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో కన్నడిగుల ప్రయోజనాలకు పూర్తిభద్రత కలదన్నారు. ఎవరికయినా ఏమైనా ఇబ్బందులుఉన్నట్లయితే వానిని తమ దృష్టికి తెచ్చినచో పరిష్కరింప ప్రయత్నించగలమన్నారు.

భాషావిభేదాల పాటింపక ప్రభుత్వము అందరికీ సౌకర్యాలు కల్పింపగలదనీ ఎవరూ ప్రత్యేక ప్రయోజనాలకు క్లెయిమ్‌చేయరాదనీఅన్నారు. తాము రాయలసీమకు చెందిన వారవడము వలన కన్నడిగులతో సన్నిహిత సంబంధములకలదనీ ఒకప్పుడు ఆంధ్రకర్ణాటకాలన్నీ కృష్ణదేవరాయల రాజ్యంక్రిందవనీ అందువలన ఆంధ్రమైసూర్‌లు వేర్వేరు రాష్ట్రాలయినా రెంటికీ సన్నిహిత సంబంధం ఉన్నదనీ వీరు అన్నారు.

భాషారాష్ట్రాలు యేర్పడినందున ఇప్పుడు అంతా సంతోషంగా ఉన్నామనీ పరస్పరాభివృద్ధికి ఆంధ్రమైసూరు తదితర రాష్ట్రాలు కృషి చేయవచ్చునని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సైప్రస్‌కు రావలసిందిగా మకారియస్‌కు గవర్నర్ ఫుట్ ఆహ్వానం

లండన్, జూలై 6

సైప్రస్ పరిష్కారానికి బ్రిటన్ సూచించిన పథకంపై చర్చల నిమిత్తం సైప్రస్‌కు రావలసిందిగా ఆర్చిబిషప్ మకారియస్‌కు ఒక లేఖ ఏథెన్స్‌లోని బ్రిటిష్ ఎంబెసీద్వారా అందజేయబడినట్లు సైప్రస్ గవర్నర్ సర్ హార్డ్ ఫుట్ నేడు వెల్లడి పరిచాడు. సైప్రస్‌లో రెండు వర్గాలున్నాయన్న విషయం ఆధారంగా బ్రిటిష్ పథకంవల్ల కల్లోలమే సంభవిస్తుందని మకారియస్ భావించి ఆ పథకాన్ని అంగీకరించరాదంటున్నాడు గాని అసలు యీరెండు వర్గాలు సయోధ్యతో పనిచేసే అవకాశాన్ని ఆలోచించవచ్చుకదాఅని ఫుట్ అన్నాడు. హింసాకాండ తగ్గితేనే అత్యవసర పరిస్థితిని తొలగించడం జరుగుతుందనీ యీ పరిస్థితి కల్పించేందుకు వీలుగా మీరు చర్చల్లోపాల్గొడానికి సైప్రస్ రావలసిందనీ ఫుట్ మకారియస్‌కు వ్రాసిన లేఖలో ఉంది.

జోర్లూ అభిప్రాయం

ఇస్తాన్‌బుల్, జూలై 6: టర్కిష్‌విదేశాంగ మంత్రి ఫాతిన్‌రుచూ జోర్లు యిక్కడ ఒక విలేఖరుల గోష్ఠిలో ప్రసంగిస్తూ సైప్రస్‌పై మూడు ప్రభుత్వాల ఆధిపత్యం కొన్నాళ్ళు సాగిన తర్వాత టర్కీకోరిన సైప్రస్ విభజనలోని అవశ్యకత తెలిసిరాగలదన్నాడు. టర్కీ సైనిక చర్చల్లో పాల్గొడానికి సిద్ధంగా ఉందనికూడా ఆతడన్నాడు.

బగ్దాద్ సంధికి చెందిన నాల్గుముస్లిం రాజ్యాల అధిపతులు జూలై 14న ఇస్తాన్‌బుల్‌లో సమావేశం కానున్నట్లు కూడా జోర్లూ వెల్లడించాడు. ఇరాన్ షా రెజాపహ్లావీ అభ్యర్థనపై ఈ సమావేశం ఏర్పాటు చేయబడుతున్నదట.

ఆగ్నిలరీ దళం రక్షణ దళంలో భాగమే

దేశాన్ని రక్షించుకో వలసిన సమయంలో అంతా కలసి పని చేయాలని శ్రీ కృష్ణమీనన్

న్యూఢిల్లీ, జూలై 6

రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నేడిక్కడ మాట్లాడుతూ భారతదేశానికి మరో దేశంపై దురాక్రమణ జరపాలనే కోరిక లేదనీ, కాని మరో దేశం దురాక్రమణ జరిపితే మన రక్షణ దళం వారినెదుర్కొని పోరాడుతుందనీ అన్నారు.

నేడిక్కడ ఢిల్లీ ఆగ్నిలరీ వైమానిక దళ పెరేడ్ వందనాన్ని స్వీకరిస్తూ ప్రాంతీయ సైన్యాలు, వైమానిక దళం అన్నీ దేశరక్షణ దళంలో భాగమేనని శ్రీ కృష్ణమీనన్ అన్నారు.

అవసరం వచ్చినప్పుడు దేశాన్ని కాపాడుకొనే కార్యత రక్షణదళాలజ ఎంత ఉందో ఆగ్నిలరీ దళాలకూ, ప్రజలకూకూడా అంతేఉన్నదని ఆయ అన్నారు.

కాళోజీకి సన్మానం

హైదరాబాద్, జూలై 6

శ్రీ కాళోజీ నారాయణరావు రాష్ట్రవిధాన పరిషత్తుకు ఉపాధ్యాయ నియోజకవర్గంనుండి ఎన్నికయినందుకు హర్షంవెల్లడిస్తూ ఆయన గౌరవార్థము నిన్నసాయంత్రం శ్రీ పి.రాఘవేంద్రరావు (అడ్వొకేటు) ఆగాపూరాలోని తమ ఇంట అల్పాహారవిందుజరిపారు. కాళోజీని లాంఛనప్రాయంగా పరిచయంచేస్తూ డా॥ వి. రామరాజు ప్రసంగించారు. కాళోజీ ఉచితరీతిని జవాబిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రతివ్యక్తీ తన ఓటుబలమును గుర్తెరగాలనీ ఓటుచేయడంలో నిర్లక్ష్యం చూపరాదనీ నుడివారు.

(మా.వి)

ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, పాఠకులకు మఱియు లైబ్రరీలకు

మా విజ్ఞప్తి

బాలబాలికలకు విద్యాభివృద్ధికి, మఱియు వారికి సుబుద్ధిని బోధించు- త్యాగము, భక్తి, వీరత్వము, వినోదము- కలిగించు బాలసాహిత్య గ్రంథములను సులభశైలిలో వ్రాయించి ప్రచురించినాము. వీటిని ప్రతివారును తప్పకుండా చదివి మా కృషిని ఫలవంతము చేయగలరని ఆశించుచున్నాము.

మఱియు, ప్రతి లైబ్రరీయందును ఉండవలసిన నాటికలు, నాటకములు, నవలలు, శరత్ సాహిత్యము, గోపిచంద్, చలం, మొదలగువారు వ్రాసిన ప్రఖ్యాత గ్రంథములు మా వద్ద లభించును.

స్కూలు పిల్లలకు ప్రతినిత్యము ఉపయోగపడు టెక్స్టు బుక్స్, రికమెండ్ బుక్సు, జనరల్ బుక్సు, గైడ్సు- మరియు- ఎక్సరుసైజు బుక్సు, నోట్ బుక్సు, పెన్సు మొదలగునవి అన్నియు లభించును.

వలయువారు:

చందానారాయణ శ్రేష్ఠి

విద్యావిషయక ప్రచారకులు,

జనరల్ బజార్, సికింద్రాబాదు.

బ్రాంచీలు:

(1) చార్‌కమాన్, హైదరాబాదు-2.

(2) సిద్దంబర్ బజారు, హైదరాబాదు-1,

(3) మెయిన్‌రోడ్, వరంగల్లు.

GANESH * GANESH * GANESH * GANESH * GANESH

REMEMBER GANESH MEDICAL HALL for GENUINE & FRESH MEDICINES

Suppliers to the Govt. Departments

SULTAN BAZAR HYDERABAD AP. Phone: 5440 Grams "CHEMISTS"

నవీన రకముల అందమైన చీరలు

పైషన్స్

పార్కులేన్ (ఫోన్: 6258) సికింద్రాబాద్

FASHIONS PARK LANE SEC'BAD PHONE: 6258

భారతీయ భాషలలో నుడికారాలు, సామెతల సామ్యం

శ్రీ మోటూరి సత్యనారాయణ

భారత దేశం పలు భాషలు గల దేశం. అన్ని భాషలున్నందునే, దేశ నైక్య సాధనకు ప్రత్యేక ప్రతిబంధకమేర్పడినదని అధిక సంఖ్యాక భారతీయులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ భాషలలోని తేడాలను నిర్ణయించి, వాటిలోని పదజాలం, వాక్య నిర్మాణ విధానం, వ్యాకరణం, నుడికారం, ఉచ్చారణల ప్రతిపదికలపై ఆ భాషల యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని నిర్ణయించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి.

భారతదేశంలో జరుపబడిన భాషావిషయిక పరిశీలనలనుబట్టి దేశంలో 179 భాషలు, 544 మాండలిక భాషలు వాడుకలోవున్నట్లు తేలింది. మాండలిక భాషలను పుపయోగించే ప్రజల సంఖ్య చాల తక్కువ. ఒక ప్రాంతంలో మాండలిక భాషనుపయోగించే ప్రజల సంఖ్య ఆ ప్రాంతపు మొత్తపు జన సంఖ్యతో పోల్చితే అది చాల తక్కువగావున్నది. ఈ మాండలిక భాషలు ఎక్కువగా తూర్పు ప్రాంతములోను, మధ్యప్రాంతంలోను, హిమాలయ ప్రాంతంలోను కన్పిస్తాయి. అందులో చాల భాగము పరస్పర సంభాషణకుపయోగించే భాషలే. ఒక్కొక్క భాషాప్రాంతములోని ప్రజలు అక్కడి ప్రాంతీయ భాషద్వారా సమైక్య భావాన్ని పెంపొందించుకుంటున్నందున, మాండలిక భాషల వాడుక రోజు రోజుకి తగ్గిపోతున్నది.

గత 5 లేక 6 దశాబ్దాలలో భారతదేశంలోని సాంఘిక, రాజకీయ, మత రంగాలలో కొనసాగించబడిన బహుళ ఉద్యమాలద్వారా నేమి, ఈ కార్యకలాపాలు తీవ్రతరం కావడం వల్లనేమి, వివిధ ప్రాంతీయ భాషలు సమైక్యాన్ని పదజాలం, సాహిత్యము విస్తృతి చెందాయి. ముద్రణాలయాలు రావడం వల్ల భారతీయ భాషల ప్రమాణీకరణ సాధ్యమైనది. అక్షరాస్యత పెంపొందడము, విద్యవల్ల వివిధ స్థాయిలలోను ఆసక్తి పెంపొందడం (ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలు) వల్ల ఒకే ప్రాంతంలోనే పలు చోట్ల వాడుకలోవున్న పదజాలం, నానుడులు, సామెతలను కలుపుకొని నడకు ప్రమాణాలలో ప్రాంతీయ భాషలను తీర్చిదిద్దడానికి అవకాశం కలిగింది.

అతిశయోక్తి కాదు

ప్రాంతీయ భాషల అభివృద్ధికి గత 5 లేక 6 దశాబ్దాలలో జరిగిన కృషియొక్క తీవ్రతను విస్తరణను పాణిని కాలంలోను, ఆ తర్వాత సంస్కృత భాషాభివృద్ధికి జరిగిన కృషితో పోల్చవచ్చును. ఇందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. ఒక్కొక్క భారతీయ భాషయొక్క వ్యాకరణ నిబంధనలేమి, వాక్య నిర్మాణ సూత్రాలేమి అతి తీవ్రమయిన మార్పులు చెంది పరిపూర్ణతను సాధించాయని చెప్పవచ్చును. ఈనాడు వ్యావహారిక భాష ప్రమాణీకరించబడి, ఆ భాషా మండల మందంతటా వ్యాకరణం, వాక్యనిర్మాణాల విషయంలో ఎక్కువ తేడాలు లేకుండా, ఆ భాష అర్థం చేసుకోబడుతున్నది. ఈ విధంగా భాషా ప్రమాణీకరణేగాక భాషాసమైక్యం కూడా సాధించబడింది.

బోధనా సంస్థలలో ప్రవేశపెట్టబడిన విద్యావిధానానికితోడు, వాడుకలోవున్న పదాలను బహుళ ప్రచారంలోకి తేవడానికి వార్తాపత్రికలు విశేషముగా తోడ్పడుతున్నాయి. ఇరుగుపొరుగులగల భాషలలోని పదాలను ఎరువు తెచ్చుకోడానికి, కొత్తపదాలను సృష్టించడానికి, సంస్కృతంనుంచి, ఆంగ్లంలాటి విదేశ భాషలనుంచి మాటలను తీసుకోడానికికూడా వార్తాపత్రికలు సాయపడుతున్నాయి.

భారతీయ భాషల అభివృద్ధికి ఒక్కొక్క ప్రాంతంలోని అక్షరాస్యత పెరుగుదల కొలతబద్ధ అంశంగాక పాఠకులు వర్తమాన సమస్యలపట్ల, తమ ప్రాంతీయ భాషయొక్క సాహిత్యం పెంపుదలపట్ల ప్రదర్శించే ఆసక్తిపైనకూడ భాషల అభివృద్ధి ఆధారపడిఉన్నది. భారత దేశంలోని అక్షరాస్యత నూటికి 25 వంతులు పెరిగినదని ఖచ్చితంగా చెప్పవచ్చును.

శ్రీ. వె. పదహారవశతాబ్దంనుంచీ భారతీయ ప్రజలు, నిరక్షరాస్యులు సైతం, తమ ప్రాంతీయ భాషలలో పురాణాలను వినడంపట్ల ఎక్కువ ఆసక్తిని ప్రదర్శిస్తూ వచ్చారు. భారతీయ పురాణాలలో కొన్ని ఆయా ప్రాంతాలలో వాడుకలోవున్న మాండలిక భాషలలోను, మరికొన్ని ప్రమాణీకరించబడిన ప్రాంతీయ భాషలలోను రచించబడ్డాయి. మన దేశంలోని కొన్ని భాషలలోని పదాలు అవిఅతిప్రాచీనమైనవైనప్పటికీ, అవి పుష్టికరమైనట్టివి కాబట్టి యిప్పటికీ వాడుకలో వున్నాయి. ఈ సందర్భంలో దక్షిణాది భాషయైన తమిళ భాషను ఉదాహరణగా పేర్కొనవచ్చును. క్రియ్యి సంవత్సరాల క్రిందట రచించబడిన తెలుగు, కన్నడ పౌరాణిక గ్రంథాలు ఆ భాషలు మాట్లాడే ప్రజాసామాన్యంలో ఎక్కువ ప్రచారంలోవున్నాయి. ఇకముందుకూడ వుంటాయి. ఆ గ్రంథాల రచయితలు వాటిని పరిపూర్ణమైనవిగా చేయడానికి విశేష శ్రద్ధను తీసుకొన్నారు. అదీగాక ఆ గ్రంథాలలోని కథావస్తువుయొక్క సాంస్కృతిక, సాహిత్య విలువలు శాశ్వతమైనవి.

విభక్త భారతదేశం 14 భాషలనుగుర్తించి భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో ఆ 14 భాషలను మాత్రంపేర్కొన్నది. 1951లో తయారు చేయబడిన జనాభాలెక్కలు ఈ ప్రాతిపదికపైనే తయారు చేయబడ్డాయి. ఆ ఈపేదికలోని 14 భాషలను మాట్లాడే వారిసంఖ్య మాత్రం ఉదాహరించబడింది. భారతదేశంయొక్క నైసర్గిక స్వరూపంతో భాషాసమస్యకు ఎక్కువ సంబంధమున్నది.

మన భారతీయ భాషలన్నీ దాదాపుగా కోస్తా ప్రాంతానికి చెందినవే. వాటిని కోస్తాభాషలనవచ్చును. ప్రధాన భాష హిందీ మాత్రం కేంద్ర ప్రాంతంలో ఎక్కువగా వున్నది. హిందీ భాషాప్రాంతం 5.41 లక్షల చదరపు మైళ్ళకంటె ఎక్కువ.

ఉర్దూ, హిందూస్థానీ, పంజాబీ భాషలలో హిందీభాషకు ఎక్కువ సాన్నిహిత్యంవుండడం వల్ల, హిందీ భాష ఆ మూడు భాషల వర్గంలో చేర్చబడింది. ఈ భాషలను మాట్లాడేవారి సంఖ్య 16 కోట్లు. అంటే, వీరు భారతదేశ జన సంఖ్యలో నూటికి 45 వంతులు ఉన్నారు. ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో వాడుకలోవున్న అస్సామీ భాషను మాట్లాడేవారి సంఖ్య 50 లక్షల కంటె ఎక్కువ లేదు. కాశ్మీరీ భాషకూడా అదే విధంగావున్నది. ఈ రెండు భాషలు భారత రాజ్యాంగంలోని 8 వ షెడ్యూలులో పుదాహరించబడ్డవే.

రాజ్యాంగంలో పేర్కొనబడిన 14 భాషలలో సంస్కృతం, ఉర్దూ కూడావున్నాయి. ఈ రెండు భాషలుదేశమందనితటా వ్యాప్తిచెందివున్నాయి. ఈ రెండు భాషలు మాట్లాడేవారి సంఖ్యను నిర్ణయిందడముగాని, ఆ భాషయొక్క సాహిత్య ప్రభావాన్నిగాని, పుపయోగాన్ని గాని నిర్ణయించడానికి చాలా కష్టం. మిగిలిన 8 భాషలు (అస్సామీ, కాశ్మీర్, హిందీ, ఉర్దూ, పంజాబీ, సంస్కృతం మినహాగా) కోస్తా భాషలు. వీటిలో నాలుగు భాషలు గుజరాతీ, మరాఠీ, కన్నడ, మళయాళం పశ్చిమ కోస్తావి. మిగిలిన నాలుగు తూర్పు కోస్తావి చెందినవి. పశ్చిమ కోస్తా భాష అయిన మళయాళం తూర్పువైపున సోదర భాష అయిన తమిళంతో కలుస్తున్నది. కన్నడ భాష తనకు తూర్పునవున్న తెలుగు భాషతో కలుస్తున్నది. మరాఠీ భాష ఒరియా భాష సరిహద్దుల వరకూ విస్తరించింది. గుజరాతీ, బెంగాలీ భాషలు పశ్చిమ, తూర్పు కోస్తాలలో ఎక్కువ ప్రాంతాలలోవున్నాయి.

పశ్చిమ కోస్తా భాషలు 2.77 లక్షల చదరపు మైళ్ళ ప్రాంతంలో వాడుకలోవున్నాయి. తూర్పుకోస్తా భాషలు తెలుగు, తమిళం, ఒరియా, బెంగాలీ, రెండున్నర లక్షల చదరపు మైళ్ళ ప్రాంతంలో వాడుకలోవున్నాయి. వీటినిబట్టి హిందీ, దాని అనుబంధ భాషలు భారతదేశముయొక్క మొత్తం వైశాల్యంలో నూటి 43 వంతుల ప్రాంతంలో వాడుకలోవున్నాయన్నమాట. మిగిలిన 8 భాషలు యించుమించుగా అంత మొత్తం ప్రాంతంలోవున్నాయన్నమాట.

రెండు విభాగాలు

భాషాశాస్త్ర పరిశోధనల పట్ల ఆసక్తి గల పండితులు భాషా పరిశీలనకు అనాదికాలంనుంచీ భారతదేశాన్ని రెండు భాగాలక్రింద విభజించారు. ద్రవిడ భారత దేశము, ఆర్యుల భారతదేశం అని విభాగించబడ్డాయి. ఆర్యుల ప్రాంతములోను, ద్రావిడుల ప్రాంతంలోను వాడుకలోవున్న భాషలయొక్క భేదాలను, ఎల్లలను నిర్ణయించడానికి యీ విభాగాలు చేయబడ్డాయి. ఒక ప్రాంతంలో, ద్రావిడ భాషాప్రభావం ఎక్కువవుంది. రెండవ ప్రాంతంలో సంస్కృత భాషాప్రభావమెక్కువ. భారతీయ భాషలలోని యీ అతిస్వల్ప భేదాలను గుర్తించడం కష్టమే అయినా, ఈ ప్రాంతాలలోని వాడుకకు పుపయోగించే ప్రాతిపదిక పదాలు మాత్రము భిన్నమైనవని ఖండితంగా చెప్పవచ్చును. ద్రావిడ భారతదేశంలోని భాషలలోని సర్వనామాలు, క్రియాపదాలు మొదలైనవి దాదాపుగా ఒకే రకంగా వున్నాయి. ఇదేవిధంగా ఆర్యుల భారతదేశంలో పుపయోగించబడే భాషలలోకూడా ఇదే విధమైన సాన్నిహిత్యంవున్నది.

భాషాపేత్తల సిద్ధాంతం ప్రకారం ద్రావిడ భారతదేశంలో వాడుకలోవున్న భాషలు నాలుగు. అవి తమిళం, కన్నడం, మళయాళం. వింధ్యకు దక్షిణానవున్న ప్రాంతాన్ని భాషా విషయకంగా నాలుగు ప్రాంతాలక్రింద విభజించడానికి కారణం ఆ ప్రాంతపు నైసర్గిక స్వరూపమే. ఉత్తరంనుంచి దక్షిణ దిశగావున్న పశ్చిమ కనుమలు దక్షిణ భారతదేశాన్ని విభజించి తమిళప్రాంతం నుంచి మళయాళ ప్రాంతాన్ని, తెలుగు ప్రాంతంనుంచి కన్నడప్రాంతాన్ని విడదీశాయి. ద్రావిడ భాషా వర్గానికి చెందిన కన్నడం, తెలుగు భాషలయొక్క ప్రభావం పొరుగు భాషయైన మరాఠీలో కన్పిస్తుంది. కొంతవరకూ గుజరాతీలో కూడా కన్పిస్తుంది. మధ్యభారతదేశంలో ఒకే భాష వ్యాప్తిలో వుండడానికి కారణం (స్వల్పమాండలిక భేదాలు గల) ఈ ప్రాంతంలో పర్వతాల అవరోధాలు లేక ఒకకొననుంచి మరొకకొనకు రాకపోకల సౌకర్యాలుండడమే. ఈ విధముగా భారతదేశంయొక్క నైసర్గిక స్వరూపమే భాషామండలాల విభజనకు ఎక్కువగా దారితీసిందని స్పష్టపడింది. వివిధ భాషలు మాట్లాడే ప్రజలలో ఏకాకిమనస్తత్వం ఏర్పడింది.

విజ్ఞానశాస్త్రం యితర రంగాలలో అభివృద్ధికి ప్రాంతానికీ ప్రాంతానికీగల దూరాలుఅడ్డురావని నిరూపించినట్లుగానే ఒక చోటు నుంచి మరొక చోటుకు రాకపోకలుఏర్పడి, ప్రజలలో సమైక్యభావాన్నికల్పించినందున, ఈనాడు భారతీయ భాషలు ఒకదానిదగ్గరకు ఒకటి వస్తున్నాయి.

ఇంతేగాక దేశంలో రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాలు రోజు రోజుకీ ఎక్కువ అవుతున్నాయి. సమైక్య సాధనకు వివిధ స్థాయిలలో కృషి తీవ్రతరం చేయబడింది. ఒక ప్రాంతంలోని వారికి మరొకప్రాంతములోని భాషాసాపిత్యాన్ని తెల్సుకోవాలన్న ఆసక్తి ఎక్కువైంది. అనువాద సాహిత్యముకూడా పెంపొందడంతో భారతీయ భాషల ముఖ్య సన్నిహితత్వం ఎక్కువైంది.

భారతదేశంలో భాషా సమైక్యాన్ని సాధించడానికి మూడు రంగాలద్వారా కృషి జరగాలి. మొట్టమొదటిది సాంఘిక సంబంధాలు. రెండవది సాంస్కృతిక సంబంధాల పెంపుదల. మూడవది రాజకీయ పరిపాలనా రంగాలలో సమైక్యం. భారతదేశం సాంస్కృతిక విషయాలలోను, రాజకీయ విషయాలలోను పదిగా ముందుకు సాగిపోతున్నది. భారతీయ భాషలలో చేరిపోయిన సమానపదాలను మనం పరిశీలిస్తే వాటిలో నూటికి 60 వంతులు సంస్కృతం, అరబ్బీ లేక పర్షియన్ భాషలనుంచి తెచ్చుకున్నవే. ఒకేపదజాలాన్ని సృష్టించడానికి జరుగుతున్న కృషి జయప్రదంగా ముందుకు సాగుతున్నది. ఒకటి రెండు దశాబ్దాలలో మనపాలకులు, కవులు, రచయితలు, భాషా సరిహద్దులు లేకుండానే మనదేశాన్నంతటినీ చుట్టిరాగలరు.

మనదేశంలోని విద్యారంగములోని కార్యకలాపాలు విస్తృతంచెంది మన భాషలమధ్య సన్నిహితత్వాన్ని సాధించడానికి భవిష్యత్తులో తోడ్పడగలవు. భారతీయ భాషలన్నింటికీ ఒకే వర్ణనమ్నాయం వున్నట్లయితే భారతీయ భాషల పదజాలం, నానుడిలో విషయంలో సమైక్యాన్ని అతిత్వరగా సాధించగలిగేవాళ్ళం. భారతదేశంలోని అక్షరాస్యులలో నూటికి 90 వంతుల మందికి అక్షరాలుమాత్రం పేరుగాని ఉచ్చారణలో అంత తేడా కన్పించదు. ఉదాహరణకు తెలుగులో "గోడలకు చెవులుంటాయి" అన్న సామెతవుంది. అరవంలోని దాని పర్యాయంలో ఎక్కువ తేడాలేదు. 'సెవురుక్కుం సెవి వుండు' అన్నది అరవ సామెత. ఇదేవిధంగా అనేక ఉదాహరణలున్నాయి. అక్షరాలలో తేడాను తొలగించడం సాధ్యంకాకపోయినా భారతదేశానికంతకూ ఒకే అక్షర సమామ్నాయాన్ని అదనంగా విస్తరింపచేయడం సాధ్యమే.

(ఆకాశవాణి సౌజన్యంతో)

భూమి : దాని పుట్టు పూర్వోత్తరాలు

రచన :- ఎస్. కబుజెంకో

భూమి యేవిధంగా పుట్టిందో తెలుసుకోవాలన్న జిజ్ఞాస మానవజాతికి ప్రాచీనకాలంనుండీ ఉంటున్నది. భూగోళశాస్త్రం, గణితశాస్త్రం, పదార్థ విజ్ఞాన శాస్త్రం మొదలైనవి యింకా ప్రాథమిక దశలలోఉన్నప్పుడు విజ్ఞాన శాస్త్రజ్ఞులు, యితర మేధావులుకూడా భూమిని భగవత్ సృష్టిగా భావిస్తుండేవారు 18 వ శతాబ్దములో మాత్రమే భూమి పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన వైజ్ఞానిక సిద్ధాంతాలు రూపొందాయి ప్రకృతి మారడం అసాధ్యమనే భావాలు నడలుతూ, ప్రపంచం మార్పుపైన ఆధారపడి అభివృద్ధిని పొందుతున్న నూతన వైజ్ఞానిక భావాలు యేర్పడుతున్న సమయమది. దైవిక శక్తుల ప్రమేయం లేకుండానే ప్రకృతి పరిణామాన్ని పొందుతుందన్న వాదం ప్రధానంగా భూమి : దాని పుట్టు పూర్వోత్తరాలను గురించి కేంట్ - లప్లసీలు చేసిన సిద్ధాంతంలో వ్యక్తమయింది.

కేంట్ - లప్లసీ సిద్ధాంతం

కేంట్ - లప్లసీల సిద్ధాంతము ప్రకారం యిప్పటి సౌర కుటుంబము జ్వలిస్తున్న ఒక వాయుపూరిత నీహారిక (నెబ్యూలా) నుండి ఉద్భవించింది. ఈ నీహారిక సూర్య మండలము చుట్టూ పరిభ్రమిస్తూ నింపాదిగా చల్లబడి, ముకుళించుకొని పోసాగింది. తత్ఫలితంగా దాని పరిభ్రమణ వేగం అధికమయింది. ఈవిధంగా వేగం అధికమయిన స్థితిలో ఆ వాయువు ఒక్కొక్కచోట కూడిక అయి, చల్లబడి గ్రహాలు రూపొందాయి.

ఈవిధంగా యేర్పడిన గ్రహాలు ఒకే సమతలంలో, వలయాకారపు కక్ష్యలో ఒకే మార్గంలో పరిభ్రమించవలసిఉంటుంది. సౌర కుటుంబానికి చెందిన గ్రహాలు యేవిధంగా పరిభ్రమిస్తుంటాయో అందరికీ తెలిసిన విషయమే. కేంట్ - లప్లసీ సిద్ధాంతం భూమి, ఇతర గ్రహాల యొక్క గమనానికి సంబంధించిన ప్రాథమిక లక్షణాలకు యీవిధంగా అర్థం చెబుతూవచ్చింది.

కాని, కేంట్ - లప్లసీ సిద్ధాంతం, చారిత్రక దృష్ట్యా చూచినట్లయితే, అష్టాది 18 వ శతాబ్దపు విజ్ఞాన శాస్త్రపు స్థాయికి మాత్రమే పరిమితమైఉన్నది. ఆనాటికి గ్రహాలకు సంబంధించిన లక్షణాలను గురించి మనకు యెక్కువగా తెలియదు. పదార్థ విజ్ఞాన శాస్త్రం అంతగా అభివృద్ధిని పొందలేదు. పదార్థ విజ్ఞాన శాస్త్రం, రసాయనిక శాస్త్రం, భూగోళ శాస్త్రం, భూగర్భ శాస్త్రం మొదలైనవి అత్యంతంగా అభివృద్ధిని పొందిన 19 వ శతాబ్దంలో కేంట్ - లప్లసీ సిద్ధాంతము అసంపూర్ణమయినదనీ, సమర్థించుటకు సాధ్యముకానిదనీ నిరూపణ అయినది. ఈ సిద్ధాంతం ప్రకారం వివిధ గ్రహాల ఉపగ్రహాలు యెందువల్ల తమ చుట్టు తాము గ్రహాలు తిరిగే మార్గానికి వ్యతిరిక్తమయిన మార్గంలో తిరుగుతున్నాయో, సూర్యమండలం యెందువల్ల తక్కువ వేగముతో కదులుతున్నదో చెప్పడము కష్టమయిపోతుంది. 20 వ శతాబ్ది ఆరంభానికల్లా కేంట్ - లప్లసీ సిద్ధాంతంలోని లోపాలు ప్రస్ఫుటంకాజొచ్చాయి.

జీన్‌యొక్క జగదుత్పత్తి సిద్ధాంతం

ఈ శతాబ్దం 3వ దశకంలో జీన్ యొక్క జగదుత్పత్తి సిద్ధాంతము విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ సిద్ధాంతం ప్రకారము ఇప్పుడు గ్రహాలుగా రూపొందిన పదార్థము, ఒకానొక నక్షత్రము సూర్యమండలంనుంచి పయనించిన సందర్భంలో ఆ నక్షత్రపు ఆకర్షణ శక్తిమూలంగా సూర్యమండలము నుండి బయటికి లాగబడింది. సరియైన వైజ్ఞానిక పునాది లేకపోవడం వల్ల యీ సిద్ధాంతం విమర్శలకు నిలబడలేకపోయింది. సౌర కుటుంబపు బ్రహ్మాండమైన పరిమాణము దృష్ట్యా జీన్‌యొక్క, సిద్ధాంతము యేవిధంగా సమర్థింపరానిది అవుతుందో అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు రసెల్, సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్. ఎస్. పరిస్కీర్ నిరూపించారు. ఈవిధంగా విశ్వసృష్టికినంబంధించినసిద్ధాంతాలు ఒక్కొక్కటే పూర్వపక్షం అయిన తర్వాత ప్రఖ్యాతగణితశాస్త్రజ్ఞుడైన ఎకడమీషియన్ ఓ. వై. స్మిత్ నాయకత్వంలో ఒక సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తల బృందం భూమి, తదితర గ్రహాల పుట్టుపూర్వోత్తరాలను గురించిన మరొక కొత్త సిద్ధాంతాన్ని రూపొందించింది.

స్మిత్‌యొక్క నూతన సిద్ధాంతం

స్మిత్ సిద్ధాంతం ప్రకారము నలుచదనైన వాయువు, దుమ్ము కణాలతోకూడిన పదార్థంనుండి ఇప్పటి గ్రహాలు రూపొందాయి. ఘన రూపంలోనున్న దుమ్ము కణాలు గ్రహాల సృష్టిలో ప్రముఖ పాత్రను వహించాయి. మొదటి విషయము యేమిటంటే, వాయువు ఘనీభవిస్తూ యీ దుమ్ము కణాల చుట్టూ పేరుకోనసాగింది. రెండవ విషయము యేమిటంటే, ఆ కణాలు ఒకదానితో మరొకటి కొట్టుకొనడము వల్ల, వాటిలోని శక్తిలో కొంతభాగం ఉష్ణంగా మారి రోదసిలోకి ప్రసారం కావడము జరిగింది. ఈవిధంగా మెకానికల్ శక్తి ఉష్ణశక్తిగా మారే ప్రక్రియ వాయువు, దుమ్ముతోకూడిన మబ్బుల నుండి గ్రహాలు రూపొందడానికి తోడ్పడింది: ఈ విషయాన్ని స్మిత్, ఎ. ఐ. లెబెదిన్స్కీ, తదితర సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తలు తమ సిద్ధాంతంలో నిరూపించారు. మెకానికల్ శక్తి ఉష్ణశక్తిలోనికి మారడానికి సంబంధించిన గణన ద్వారా గ్రహాలు యే విధంగా రూపొందాయో తెలుసుకొనడమే గాక, అలా యేర్పడిన గ్రహాలు ఒకదానికి మరొకటి యెంత దూరములోఉండగలవో లెక్క కట్టడము కూడా సైద్ధాంతికంగా సాధ్యమయింది. ఈ విధంగా స్మిత్ సైద్ధాంతికంగా లెక్కగట్టిన దూరాలు, పరిశీలనలద్వారా, సేకరింపబడిన సమాచారంద్వారా ధ్రువపడ్డాయి.

మెకానికల్ శక్తి ఉష్ణశక్తిగా మారడం వల్ల కలిగే ప్రభావము మూలంగా గ్రహాలు యిప్పటి విధముగా తమ చుట్టూ తిరుగుతూ, సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి అని స్మిత్ కట్టిన లెక్కలు నిరూపిస్తున్నాయి. ఉపగ్రహాలు యేర్పడి' గ్రహాలు తమ చుట్టు తాము తిరిగే మార్గానికి వ్యతిరేకమైన మార్గంలో తమ చుట్టు తాము యెందువల్ల తిరుగుతున్నాయన్న విషయాన్ని కూడా యీ సిద్ధాంతం వివరిస్తుంది. ఉపగ్రహాల విషయంలో, గ్రహాలకు అత్యంతదూరమైన స్థాయిలో మెకానికల్ శక్తిలో గొద్ది భాగము మాత్రమే ఉష్ణశక్తిగా మారడం వల్ల అవి, గ్రహాలు తమ చుట్టు తాము తిరిగే మార్గానికి వ్యతిరిక్తమయిన మార్గంలో తమ చుట్టు తాము తిరగడం జరుగుతుంది.

పట్టు పరిశ్రమాభివృద్ధి

న్యూఢిల్లీ, జూలై 6

దేశంలో ముడి పట్టు ఉత్పత్తి నానాటికీ అభివృద్ధి చెందుతోంది. 1953 లో 24,61 750 పౌండ్ల ముడి పట్టు ఉత్పత్తి కాగా, 1956 లో 34,13,245 పౌనల ముడి పట్టు ఉత్పత్తి అయింది.

ఇండియాలో పట్టు పురుగుల పెంపకాన్ని, పట్టు పరిశ్రమను అభివృద్ధి చేసే నిమిత్తం 1949లో కేంద్ర పట్టు బోర్డు ఆనే ప్రత్యేక వ్యవస్థ యేర్పాటు చేయబడింది.

రెండో ప్రణాళిక పూర్తయే నాటికి పట్టు పరిశ్రమలో స్వయం సమృద్ధతను సాధించడానికి కేంద్ర పట్టు బోర్డు ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర పరిశ్రమశాఖలు ఇందుకు సంబంధించిన అంశాలు జరిపే ఆయా పథకాల నిమిత్తము ద్వితీయ ప్రణాళికలో 5 కోట్ల రూపాయలు కేటాయించబడినవి.

1957 - 58 వ సంవత్సరానికి కేంద్ర పట్టు బోర్డు పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగు, ముడి పట్టు విక్రయం, వీటికి సంబంధించిన కార్యక్రమాలను రూపొందించింది. అఖిల భారత పట్టు పురుగుల పెంపకము, శిక్షణ సంస్థను నెలకొల్పడానికికూడా ఒక పథకాన్ని తయారు చేసింది.

కేంద్ర పట్టు బోర్డు సిఫార్సులపై ఆయా కార్యక్రమాలను అమలు పరచే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వాలకు అదే సంవత్సరంలో రూ. 39,76,575 విరాళంగానూ, రూ. 20,87,050 లు ఋణంగాను మంజూరు చేయడం జరిగింది.

చెకోస్లోవాకియా చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి

జిరీ మరెవ్

ఈ ఏడాది చెకోస్లోవాకియా చలన చిత్రరంగం తన 60 వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటూంది. 60 సంవత్సరాల క్రితం ఆస్ట్రియన్ రాచరికంలో రాజకీయంగా పరాధీన దశలో వుండిన చెక్ జాతి ఈనాటి స్థితికి పురోగమించి తన మహత్తర శక్తి సామర్థ్యాలను రుజువు చేసికొన్నది. లుమైరీ సోదరులు తమ మొట్టమొదటి చిత్రాలను పారిస్‌లో ప్రదర్శించిన రెండేళ్ళ పిమ్మట, యీ సోదరుల నూతన సృష్టియొక్క ప్రాముఖ్యమును గ్రహించినవాడై చెక్ ఇంజనీరు జిరొస్లావ్ కిర్జెనెకీ వారివద్ద తొలిసారిగా ఒక ఫిల్ము కెమెరాను కొని తెచ్చుకున్నాడు.

ఒక్క విషయం చెప్పవలసివుంది. లుమైరీ సోదరులు సినిమాను కనిపెట్టకముందు చాలాకాలం క్రితమే ప్రఖ్యాత చెక్ శరీర శాస్త్రజ్ఞుడు జాన్ ఇవాంజెలిస్టా పుర్కిన్ "చలన చిత్రాల" నమూనాలను గూర్చి పరిశోధించాడు. ఈ బహుముఖ విజ్ఞానవేత్త (1787-1869) స్ట్రాచొస్కోప్ అనే పరికరంతో యీపరిశోధన సాగించాడు. ఆయనీ పరిశోధనలలో కృతకృత్యుడు కాలేకపోయినప్పటికీ ఆనాడే, సినీమా ఒక స్వతంత్ర కళ కాగలదనీ, దానికి గొప్ప భవిష్యత్తు వున్నదని ప్రకటించాడు. ఇలా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే తొలిసినీమాటోగ్రాఫ్‌ను రూపొందించినలుమైరీ సోదరులు కూడదీని కళాత్మక ప్రాముఖ్యమును గుర్తించలేదు. వారు దానిని ప్రధానంగా వ్యాపారంగా వినియోగించుకోవడంలోమాత్రమేఆసక్తిచూపేరు

1898లో క్రిజెనెకీ (తొలి చెక్ ఫిల్ము డైరెక్టరూ, సినీమా ఆపరేటరూనూ) తీసిన తొలిచిత్రాలుకూడా చిన్న విడివిడి దృశ్యాలు కాకుండా, నటీనటులతో కూడిన చిత్రాలే. చెక్ చిత్రపరిశ్రమ చరిత్ర అనేక క్లిష్టదశలను గడచింది. 1945 వరకూ అది ప్రయివేటు వ్యాపారస్తుల చేతులలో వుంటూ, విదేశ సామగ్రిమీద ఆధారపడుతూ, విదేశ చిత్రాలను అనుకరిస్తూ వుండేది. అయినప్పటికీ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో పతకాలను చూరగొన్న (తొలిసారి 1934లో వెనిస్‌లో) అనేక ఉత్తమ చిత్రాలునిర్మించబడ్డాయి అమెరికా ఫ్రాంసులవంటి పెద్ద దేశాలలో వలె యీ పరిశ్రమకు ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టడం, యీ చిన్న దేశానికి కష్టతరమైనప్పటికీ అది భాగా ఉన్నత సాంకేతిక ప్రమాణాన్ని సాధించిందంటే తేలికైన విషయం, కాదు. అందువల్ల చెకోస్లోవాకియా ఖరీదైన సాంకేతిక ప్రయోగాలకు కాకుండా, కళా కౌశల్యానికే ఎక్కువ ప్రాధాన్యతయిచ్చింది.

1945 లో సినీమా పరిశ్రమ పూర్తిగా జాతీయం చేయబడడంతో సమూలమైన మార్పువచ్చింది. ప్రభుత్వము యీపరిశ్రమాభివృద్ధికి చాలడబ్బు కేటాయించింది. చెక్ సినీమా పరిశ్రమ మహత్తర విజయాలు సాధించింది. ముఖ్యంగా కార్టూన్, పపెట్ చిత్రాలు యీనాడు ప్రపంచ ఖ్యాతి పొందేయి. ఫీచర్ ఫిల్ముల విషయం గూడా 1947లో వెనిస్‌లో జరిగిన చిత్రోత్సవంలో "సిరీన్" చిత్రానికి ప్రథమబహుమతి వచ్చింది. ఇటీవల సులభ విజ్ఞాన బోధనాత్మక చిత్రాలుకూడా ఉత్తమ శ్రేణికి చెందినవై ప్రసిద్ధిగాంచాయి.

పపెట్ ఫిల్ములు, విజ్ఞానచిత్రాలు కార్టూన్ చిత్రాలేకాక, అనేక నవకాలిక కథావస్తువుతో కూడిన చిత్రాలూ, చారిత్రక చిత్రాలుకూడా బాగా విజయం సాధించాయి. వీటిలో కొన్ని విదేశాలలోకూడా చాల ఆదరణ పొందాయి. చెక్ ఫిల్ము నిర్మాతలు అనేక కామెడీ చిత్రాలుకూడా తీశారు. వాటిలో ముఖ్యంగా "దిషోగోష్ ఆన్" అనే సర్కస్ చిత్రం ప్రత్యేక పరిగణన పొందింది.

ప్రతి ఏటా కార్లొ వీవరీలో జరిగే అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలతో చెకోస్లోవాక్ చలన చిత్రరంగానికి సన్నిహిత సంబంధం వుంది. ప్రాక్పశ్చిమ దేశాలనుండి అనేక మంది ఫిల్ము ప్రొడ్యూసర్లు పాల్గొన (యిందులోనే తొలిసారిగా చైనీస్, భారతీయచిత్రాలువిస్తృతస్థాయిలో ప్రదర్శించబడ్డాయి) యీపెద్ద చలన చిత్రోత్సవం. దేశాలమధ్య సౌమనస్యానికీ, ఫిల్ము వర్కర్ల మధ్య స్నేహ సంబంధాల అభివృద్ధికీ తోడ్పడుతుంది, స్థానిక ఫిల్ము పరిశ్రమ ప్రగతి ఎంతో దోహదమిస్తుంది కూడాను. గత ఏడాది జరిగిన కార్లొవీవరీ చలన చిత్రోత్సవం, ప్రదర్శించబడిన ఫిల్ములసంఖ్య విషయంలో ప్రపంచ చలనచిత్రోత్సవాలు అన్నిటిలో అగ్రతాంబూలం అందుకుంది.

చెకోస్లోవాక్ చిత్రాలు మంచి కళాకౌశల్యంతో కూడినవీ, అభ్యుదయ ప్రబోధకమైనవీ. సామాన్య ప్రజల జీవితాన్నీ, యుద్ధంలో వారి వీరోచిత దర్యలనూ, శాంతియుత జీవన నిర్మాణానికై వారి కృషినీ చిత్రించేవి కావడంవల్ల ప్రపంచమంతటా ప్రదర్శించబడుతున్నాయి.

చెకోస్లోవాకియాలో ముడిఫిల్ము బూ, తదితర సామగ్రిని తయారుచేసే కర్మాగారమూ, అధునాతనమైన లేబొరేటరీలు నిర్మించబడ్డాయి చెకోస్లోవాక్ అమెచ్యూర్ కెమెరాలు, స్టూడియో కెమెరాలు విదేశాలలోకూడా బాగా చలామణిలోకి వస్తున్నాయి. చెకోస్లోవాకియా పెకింగ్‌లో ఒకపెద్ద సినీమా లేబొరేటరీని నిర్మించింది.

ఈనాడు చెకోస్లోవాక్ ఫిల్ములు సాంకేతికంగానూ, కళాత్మకంగానూ కూడా బాగా అభివృద్ధి అయిన దేశాల చిత్రాలతో సరితూగగల

జూలై 11 శుక్రవారం నుండి విడుదల

ఇంపైన సంగీతముతో నిండిన అద్భుత అపరాధ పరిశోధ చిత్రము.

దీప్-ప్రదీప్ వారి

* పోలీస్ *



తా॥ మధుబాల, ప్రదీప్‌కుమార్, అన్వర్ హుసేన్, దిప్‌ఖోస్లా, నాదిర, ధుమాల్, ఓంప్రకాశ్, భగవాన్ (గెస్టాటట్)

దర్శకత్వం:- కాళిదాస్. సంగీతం:- హేమంత్‌కుమార్.

ప్రభాత్ — హైద్రాబాద్. (Trupix)
అజంతా — సికింద్రాబాద్.

నాణ్యమైన 4వ సంయుక్తవారము
వినోద ప్రొడక్షన్సు వారి

* మహాదేవి *

సాగర్ & చిత్రా
హైద్రాబాద్. సికింద్రాబాద్
మరియు
మార్కండేయ- వరంగల్. మోహన్- నిజామాబాద్. భారత్ కరీంనగర్.

మహాంకాళి జాతర సందర్భమున చిత్రా టాకీస్‌లో
రేపు 4 ఆటలు: ఉ॥ 10-30; 2-30; 6-0 మరియు 9-30 గం.
Cima పూర్ణా రిలీజ్.

పసందైన 10 వ సంయుక్త వారము
ఉత్తమసంగీతమయ చిత్రము.

అశోక్ పిక్చర్ వారి "రాగిణి"

తారాగణం: అశోక్‌కుమార్, కిశోర్ కుమార్, పద్మిని, జబీన్.
సంగీతం: ఒ. పి. నయ్యర్. రచన & దర్శకత్వం: రఖేన్.

జమ్‌ఖుద్ మహల్ — హైద్రాబాద్.
మినర్వా — సికింద్రాబాద్.

మహాంకాళి జాతర సందర్భమున మినర్వాటాకీస్‌లో
నేడు 4 ఆటలు:- ఉ॥ 11-30, 3-30, 6-30 మరియు 9-30 గం॥
మరియు భారత్ టాకీస్ - మహబూబ్‌నగర్.
(Trupix) ప్రకాశ్ పిక్చర్స్ రిలీజ్.

మహత్తరమైన 4 వ సంయుక్త వారము.

సిప్పి ఫిలిమ్స్

12,0' CLOCK

REVISED

తారాగణం: గురుదత్, వహీదారెహమాన్, శశికళ, రహమాన్, టమ్ టమ్, హెలెన్, జానివాకర్.
సంగీతం:- ఒ. పి నయ్యర్.

అశోక్ — హైద్రాబాద్
మనోహర్ — సికింద్రాబాద్.

మహాంకాళి జాతర సందర్భమున మనోహర్ టాకీస్‌లో
నేడు 3-30, గం॥ ప్రత్యేక మ్యాటినీ.
(Trupix) విజయ విడుదల.

గోలకొండ గ్రంథాలయం

శ్రీ తులసీ రామాయణము:

రచన శ్రీమతి యేలూరిపాటి లక్ష్మీ సరస్వతిగారు పుటలు 478. వెలరు 12/- లు. దొరకుచోటు సరస్వతీ పవర్ ప్రెస్ రాజమహేంద్రవరము.

ఇది గోస్వామి తులసీదాసు హిందీ భాషలో రచించిన "శ్రీరామ మానస చరితము" అను పేరుగల రామాయణ కావ్యమునకు ఆంధ్రీవచనానువాదము.

హిందువులకు భారత, భాగవత, రామాయణములు పవిత్ర గ్రంథములు. ఈ మూడు కావ్యములును ఆంధ్రీభాషలో విద్యాగదర్శములలో రచింపబడినవి కాని ఆంధ్రీ భారత, భాగవత గ్రంథములకున్నట్టి ప్రశస్తి జనామోదము ఆంధ్రీరామాయణములకు రాలేదు. కారణమేమి? నానృషి కురుతే కావ్యమ్ అన్నారు. భారతము వ్రాసిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడలు, భాగవతము వ్రాసిన పోతన ఋషితుల్యులు. కావునే వారికావ్యములు రాణించి ప్రతిష్ఠ సంపాదించుకొన్నవి. రామాయణములు రచించిన వారు పండితులు కావచ్చును, రసోదంచితముగ వ్రాయవచ్చును. ప్రతిభను ప్రకటింపవచ్చును. కాని ఋషితుల్యత్వము మన రామాయణ కావ్య కర్తలలో లోపించి యుండవచ్చునని తోచుచున్నది. ఎవడు అహంకార మమకారములువీడి, నిర్లిప్తతతో, భక్త్యావేశముతో రామాయణమువంటి మహాకావ్య రచనకు కడగునో ఆ కావ్యమే రాణించునని ప్రకటితమగుచున్నది.

ఈ గోస్వామి తులసీదాసు రామాయణ మహాకావ్యము ఆసేతు హిమాచల పర్యంతము మహాఖ్యాతిచెంది యున్నది. హిందీభాష రానివారు, ఆ కావ్యమును చదువనివారుకూడ తులసీదాసు రామాయణమును గూర్చి వినియున్నారు. తులసీదాసు పండితుడు, అంతేగాదు, తులసీదాసు శ్రీరామ భక్తులలో అగ్రగణ్యుడు అతనికి రామతత్వ నిరూపణము నందెక్కువ తాత్పర్యముగలదు, రామనామ మాహాత్మ్యమును జాటుటయందు అమితాసక్తిగలదు, ఏ వంగుణ విశేషములే "శ్రీ రామమానస చరిత"కు అజరామరమైన కీర్తినిచ్చినవి. మన కవులలో పోతన మహాకవి శ్రీరామ భక్త్యావేశముగలవాడు. అయితే రామభక్త్యావేశమునందు తులసీదాసు పోతనను మించినవాడేమో యనుటకు తులసీ రామాయణము సాక్షీభూతముగా నుండగలదు.

శ్రీ గోస్వామి తులసీదాసు శ్రీరామ పారమ్యమును, శ్రీరామ నామ మాహాత్మ్యమును ప్రకటించుట కనుకూలముగా నుండునట్లు రామాయణకథలో కొన్నిమార్పులు గావించినారు. ఇందు బాలకాండము, అయోధ్యా కాండము, అరణ్యకాండము, కిష్కింధాకాండము, సుందర కాండము, లంకాకాండము,ఉత్తరకాండము లవకుశ కాండము అనునిమిదికాండములు గలవు. ఇందలి కథాభాగములు అధ్యాత్మ రామాయణాను సారముగా మలచినట్లుగా తెలియుచున్నది. అందుచే నీ గ్రంథమునకు పవిత్రత ఎక్కువైనది, ఈ గ్రంథమునకు "శ్రీరామ మానసచరితము" అను పేరు పెట్టుటలోనే విశేషమున్నది. మానస సరోవరములో గ్రుంకులిడిన ఎంతటి పుణ్యప్రదమో శ్రీరామ కథ యను మానస సరోవరములో గ్రుంకులిడిన అంతటి పుణ్యము లభించునని భావము. కథాప్రగతి వర్ణనాంశము లనుబట్టి యీ విషయము స్ఫుటమగుచున్నది.

రామభక్తి పారమ్యము నను భవించిన తులసీదాసు ఈ కావ్యమును సుమారు నాలుగు వందల సంవత్సరముల క్రిందట రచించెను. ఈయుత్తమ గ్రంథమును ఆంధ్రీజనులు చదివి, పఠించి, పారాయణముచేసి తరించునట్లుగా శ్రీమతి లక్ష్మీసరస్వతమ్మగారు రచించిరి. శ్రీమతి లక్ష్మీ సరస్వతమ్మగారు విద్వత్కుటుంబములో పుట్టినది. విద్వత్కుటుంబములో మెట్టినది. సంస్కృతాంధ్రీ హిందీ భాషలయందు గొప్పపాండిత్యము కలవారు. చక్కనిశైలి. అర్థవంతమగు పద ప్రయోగము, ధారాశుద్ధి శ్రీరామచంద్రుని చరణారవిందములయందనన్యభక్తి ఈయను వాదమునకు వన్నె తెచ్చుచున్నవి.

ఈ గ్రంథమునందలి ప్రతిపుట, ప్రతిపంక్తి, రామమహత్వమును జాటుచుండును. అనలీరామకథను శివుడు పార్వతికి చెప్పినాడట. శివుడే శ్రీరాముని స్తుతించినట్లుగా ఈ గ్రంథము జాటుచున్నది. శివుడేకాదు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము రూపములు ధరించివచ్చి శ్రీరామచంద్రుని స్తోత్రము చేసినవి. (399). మునులు స్తుతించిరి. [404]. "మునుల రంజింప వెయుటకు, ఖలుల భంజించి, భూభారము నడంచుటకు తులసీదాసుడనగు నన్నుద్ధరించుటకును మాయామానుషవిగ్రహుడై జన్మించెను కాననోసోదరసోదరీమణులారా! ఇట్టి శ్రీరామచరితమును చదివి, విని, ఆ రాముని భజించి, సేవించి, స్మరించి, తరింపుడు" అని తులసీదాసు ఉద్బోధించుచున్నాడు [పుట 404)

"పాటల పున్నాగములు కుసుమ మాత్రి మనోహరములు. చూతమును కుసుమరమణీయమే, పనస వృక్షము ఫలమాత్రి రమ్యము. అస్లే కొందరు వాజాత్రశూరులు. మరికొందరు వాక్కిరియాదక్షులు. కొందరు క్రియామాత్రి శూరులు. కాననీవు (రావణుడు) పాటలమువలె వాజ్మాత్రశూరుడవు." [పుట 367]. ఇట్టి వాక్యరత్నములు కొల్లలుగా నున్నవి.

"కలియుగమున వర్ణాశ్రమ ధర్మములునశించును...విద్వాంసులుదాంభికులై యసత్యముల నాడుచుందురు. లోకమంతయు పరస్త్రీ ధనాసక్తమై, పరహింసాపరాయణమై యుండును. శూద్రులుబ్రాహ్మణవృత్తులను, బ్రాహ్మణులుశూద్రవృత్తులనవలంబించెదరు... కులశీలములు ధనమునుబట్టియుండును. అబలలందమునకు కేళఖండనమొనరింతురు ...కలియవగుణములకు నిధియైనను నిశ్శ్రమంబుగ దరించుటకు దగిన సూక్ష్మోపాయము లిందు గలవు ... నిర్మల చిత్తులై రామునిభజించినవారు సంసారమునవలీలగదాటెదరు. కలిలో నామ ప్రభావమెక్కుడు...." (పుట 425,426).

నీతి ప్రబోధకములు, భక్తిప్రబోధకములు. కథావైచిత్ర్యములుమున్నగు వానితో ఈగ్రంథముఒప్పుచు ప్రశస్తికి తగిన మహత్తు కలిగియున్నది. కథ పవిత్రమైనది. సాధుశీలుడుతులసీదాసు, విద్యావతియగు శ్రీమతి లక్ష్మీ సరస్వతమ్మగారు దక్షతతో ఆంధ్ర భాషలోనికి అనువదించియున్నారు. చదువ మొదలుపెట్టిన కడముట్ట చదువుటకు ఉత్సాహము కలుగును. అధ్యాత్మ రామాయణము ననుసరించి వ్రాయబడినదగుటచే పవిత్రతరమైపారాయణ యోగ్యముగా నున్నదీగ్రంథము. అందరు చదువదగినది. శ్రీమతి లక్ష్మీ సరస్వతమ్మగారుఈగ్రంథమునురచించి ఎంతయు ధన్యులైనారు. దీనిని పఠించినవారు ధన్యులు కాగలరు.

అధర్వ శ్రుతి (నెలసరి తెలుఁగు) సంచిక:

సంపాదక కృతికర్త శ్రీశ గిరిశ నరేశ. సంవత్సర చందా రు. 12/ లు 60 పేజీలు. ఇందు ప్రథమ కాండము: తృతీయానువాకమునుండి షష్ఠానువాకము షష్ఠసూక్తమునచతుర్థమంత్రి పర్యంతము సంహితాపాఠము ప్రకటించబడినది.

హిరణ్యవర్ణాఃశుచయః పావకాయాసు జాతః సవితాయా స్వగ్నిః। యాఅగ్నిం గర్భంద ధిరే సువర్ణాస్తాన ఆపః శగ్గ్ [o] స్యోనా భవంతు॥ పుణ్యాహ వాచనమునకు కలశమును ఉదకముతో పూరించే ఘట్టములో ఈ మంత్రము వినబడుతుంది. ఇది ప్రథమ కాండము: షష్ఠానువాకములోప్రథమ సూక్తము ప్రథమ మంత్రము. ఇందులోనివే ద్వితీయ, తృతీయ చతుర్థ మంత్రములు కూడా అదే ఘట్టంలో వినియోగింపబడుతున్నవి.

అర్థజ్ఞానపూర్వకమైవిధినిర్వహణమే ఆవశ్యకమని శ్రుతులలోనే చెప్పబడియున్నది అచ్చటచ్చట"యఏవంవేద" "యఉచఏన దేవంవేద" "యస్యైవం విదుషోగ్ని హోత్రం జుహ్వతి" అనే పంక్తులు వినబడుచున్నవి. అనగా అర్థజ్ఞానరహితమైన కర్మ వ్యర్థమునని తెలుతున్నది. కాగా శ్రీశగిరిశనరేశ గారు లోకానుగ్రహార్థముగాతలపెట్టిన ఈ కృషి సఫలము కాగలందులకయి అర్థవివరణముతో ఈ పై సంచికలు వెలువరింతురు గాక అని ఆశించుచున్నాము. "ఏకోమంత్ర స్స్వరతోవర్ణతోవా – మిథ్యా ప్రయుక్తో నతదర్థ మాహ"। అనిశిక్షలోచెప్పబడియున్నది కావున పాఠకులు తప్పుదారిని పడిపోకుండగలందులకై సంపాదకకృతికర్తలు అచ్చు తప్పుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తను వహింపగలందులకు కోరుచున్నాను.

మైనర్ ఇరిగేషన్‌కు అదనంగా 3 కోట్లు

కేంద్రం సాయంచేయాలని అభ్యర్థన: ఐదురాష్ట్రాల్లో 25వేల చెరువులు మరమ్మతు చేయించాలని శ్రీ జైన్ ప్రసంగం

హైద్రాబాద్, జులై 6

ప్రస్తుత ఆహార ధాన్యాల కొరతను తొలగించుటకు సత్వర అధికోత్పత్తి సాధనకు మైనర్ ఇరిగేషన్ ఒక్కటే అనుగుణమైనది కావున మైనర్ ఇరిగేషన్ స్కీములకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని ప్రాంతీయ మైనర్ ఇరిగేషన్ సమావేశంలో సూచించబడింది. మొన్న ప్రారంభమైన యీ సమావేశం నేడు ముగిసింది.

ఆంధ్ర, మద్రాసు, బొంబాయి, కేరళ, మైసూరు రాష్ట్రాల్లోని మైనర్ ఇరిగేషన్ కార్యక్రమాలను యీ సమావేశంలో పరిశీలించి ఇప్పటికి పూర్తయిన పనులను జాగ్రత్తగా నిర్వహిస్తుండడం, వీటివలన ఎన్ని ఎకరాలు సాగుకు వస్తాయో లెక్కలు తేల్చడం, ప్రస్తుతం సాగుతున్న మున్ముందు చేపట్టనున్న పనులను వేగవంతంగా నిర్వహించడం అత్యవసరమని యీ సమావేశంలో నిర్ణయించబడింది. ఈ మైనర్ ఇరిగేషన్‌కు చెందిన వివరాలన్నీ చక్కగా నిర్వహిస్తూ ఏ బాబిగాని పాడుపడకుండా పాడుపడిన బావుల్ని తిరిగి సేద్యానికి పనికి వచ్చేట్లుగా చేసేందుకు ప్రత్యేకం ఒక వ్యవస్థ ఏర్పడి పరిశీలిస్తూ ఉండాలని కూడా యీ సమావేశములో తేల్చబడింది. రైతుల నుండి అభివృద్ధి పన్నువసూలు చేయడం ద్వారా లేదా ప్రాభుత్వ నిధులనుండి కేటాయింపుద్వారా ప్రత్యేక నిధి ఏర్పాటును కూడా యీ సమావేశం సిఫారసు చేసింది. మైనర్ ఇరిగేషన్ వ్యవహారాలను నిర్వహించగల స్తోమత ఉన్నదని తగిన అధికారి చెప్పినట్లయితే ఆ పనుల్ని పంచాయతీలకు స్థానిక సంస్థలకు అప్పగించవచ్చునని కూడా సూచింపబడింది.

కమ్యూనిటీ అభివృద్ధి, జాతీయ విస్తరణ బ్లాకులకై రాష్ట్రబడ్జెటుల్లో కేటాయించబడిన మొత్తాలను లెక్కకు తీసుకుంటూ యీ యేడాది చేపట్టే మైనర్ ఇరిగేషన్ పనులకు అవసరమైన ఆర్థికస్తోమతను గురించి కూడా యీ సమావేశం చర్చలు జరిపింది. అదనంగా మూడుకోట్లు కావాల్సి రాగలదని యీ సమావేశములో అంచనా వేయబడింది. కాగా రాష్ట్రాల మైనర్ ఇరిగేషన్ పనులు కుంటుపడకుండా యీ మొత్తాన్ని యివ్వవలసిందిగా యీ సమావేశములో కేంద్రాన్ని అర్థించారు.

ప్లానింగ్ కమిషన్‌వారు మైనర్ ఇరిగేషన్ వ్యవహారాల పరిశీలనకు ఏర్పాటుచేసిన జట్టు అధ్యక్షుడు శ్రీ ఎస్. వి. గాడ్గిల్ కూడా నేడు ప్రసంగించారు.

ఈ దక్షిణ ప్రాంతంలోని ఐదు రాష్ట్రాలూ కలిసి ఆయా రాష్ట్రాల్లో చెడిపోయిఉన్న 25 వేల పైచిలుకు చెరువుల్ని మరమ్మతుచేసి సాగుకు పనికి వచ్చేట్లు చేయాల్సిందిగా కేంద్ర ఆహారమంత్రి శ్రీ ఎ. పి. జైన్ కోరారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయమంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులంతా యీ ఉదయం మల్కాపురం చెరువును, పటంచేరు, ఎన్.ఇ.ఎస్. జ్లాకు క్రింది చెరువుల్ని సందర్శించారు.

(యు.పి.ఐ)

రెండవ నౌకా నిర్మాణ సంస్థ

పశ్చిమ కోస్తాలోనే నెలకొల్ప బడగలదని ఎస్.కె. పాటిల్

విశాఖపట్టణం, జులై 6

పశ్చిమకోస్తాలోనే రెండవ నౌకా నిర్మాణ సంస్థ స్థాపింపబడగలదని కేంద్ర ట్రాన్స్‌పోర్టు రవాణాశాఖల మంత్రి ఎస్.కె. పాటిల్ ఇక్కడ పేర్కొన్నారు.

విశాఖపట్టణంలోని హిందుస్థాన్ నౌకా నిర్మాణ సంస్థవారు లక్షటన్నుల నౌకా నిర్మాణాన్ని అందుకొన్నందులకు ఈ సందర్భంలో జరుపబడిన వేడుకలకు శ్రీ పాటిల్ హాజరయినారు. జలవీర అను లక్షటన్నుల నౌక ఇంజను జలప్రవేశానికి ప్రారంభోత్సవం చేశారు. ఇంకా గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ నిర్మించిన రాజకుమార్ నౌకకు గూడా ప్రారంభోత్సవం చేశారు. మన దేశంలో నౌకా నిర్మాణ పరిశ్రమకు ఉజ్జ్వల భవిష్యత్తు కలదని ప్రభుత్వం దీనికి సహాయం చేయడంలో ఏమాత్రం వెనుకాడబంలేదని అన్నారు.

70 వేలు స్వాహాచేసిన రైల్వే క్లర్కుకు శిక్ష

అవినీతికి పాల్పడిన ఒక శానిటరీ ఇన్స్‌పెక్టరు, కార్మికులకుకూడా

న్యూఢిల్లీ, జులై 6

ఈమధ్య కేంద్ర హోంశాఖ ప్రత్యేక పోలీసు విభాగం జరిపిన దర్యాప్తు ఫలితంగా ప్రభుత్వాన్ని మోసగించి అవినీతి ప్రదంగా ప్రవర్తించినందుకు ఒక ఢిల్లీ శానిటరీ ఇన్స్‌పెక్టరుకు, 3 గురు కార్మికులకు, పశ్చిమ రైల్వే క్లర్కుకు శిక్షలు పడ్డాయి.

మలేరియా నిరోధక యూనిట్‌కు చెందిన శానిటరీ ఇన్స్‌పెక్టరు ముగ్గురు కార్మికులతో ఒప్పందానికి దిగి తప్పుడు మస్తరువేసి వారి వేతనాలను తాను జేబులో వేసుకున్నాడు. అతనిపై 14 కేసులు ఇలాంటివి ఉన్నాయి. అతనికి ఒక ఏడాది శిక్ష విధించబడింది. కార్మికులకు మూడు నెలల కఠినశిక్ష విధించారు.

రైల్వే ఉద్యోగులకు గ్రాట్యుటీగా ఇవ్వాల్సిన చెక్కులమీద తప్పుడు ఎండార్సుమెంట్లు వ్రాసి 70 వేల వరకు స్వాహాచేసిన పశ్చిమ రైల్వే క్లర్కుకు మూడేళ్ళ కఠినశిక్ష 2వేల జరిమానా (లేదా మరో యేడు కఠినశిక్ష) విధించబడింది.

నూజివీడు పంచాయత్ సమితి

నూజివీడు, జూలై 5

నూజివీడు పంచాయతీ సమితికి వ్యవసాయశాఖామాత్యులు శ్రీ పి. తిమ్మారెడ్డి 1వ తేదీన ప్రారంభోత్సవము చేశారు. శాసనసభ్యుడు శ్రీ కె. అప్పారావు యీ సందర్భంలో అధ్యక్షత వహించారు. అనేకమంది అధికార, అనధికార ప్రముఖులు సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంలోనే వనమహోత్సవం కూడా జరుపబడింది.

ఆహార పదార్థాలు, పండ్లువగైరా ఉత్పత్తిని పెంచవలసిన ఆవశ్యకతను గురించి వ్యవసాయమంత్రి నొక్కివక్కాణించారు. సమితి అధ్యక్షుడు శ్రీ హెచ్. వరదాచారి, జిల్లా కలెక్టరు, జిల్లా ప్లానింగ్ ఆఫీసర్, బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు, కూడా ప్రసంగిస్తూ సమితి లక్ష్యములను, బాధ్యతలను, విధులను పేర్కొన్నారు. సమాజ వికాస కార్యక్రమాభివృద్ధికై యీ కొత్త బాధ్యతను స్వీకరించటానికి ఉత్సాహంగా ముందుకు రావలసిందని వారు ప్రజలను ఉద్బోధించారు.

శ్రీకాకుళం జిల్లాలోని గార పంచాయతీ సమితికి అడిషనల్ డెవలప్‌మెంటు కమిషనర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో జరిగిన సమావేశానికి సమితి అధ్యక్షులు శ్రీ టి. సత్యనారాయణగారు అధ్యక్షత వహించారు. పంచాయతీ సమితులను గురించి ఒక ఏకాంకిక ప్రదర్శించబడింది.

ఆకాశవాణి పాఠశాలల కార్యక్రమాలు

హైద్రాబాదు, జూలై 6

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల కొరకు ఆకాశవాణి కార్యక్రమాలు జూలై 7వ తేదీ ప్రారంభించబడగలవు. విద్యారంగాభివృద్ధికి ఆకాశవాణిద్వారా లభించుతోడ్పాటు యీ పాఠశాలల కార్యక్రమాలు పనిచేసే రోజులలో ప్రతిరోజూ మధ్యాహ్నం 2-30, 2-50, 3-0, 3-30 గంటలకు యీ కార్యక్రమం ప్రసారం చేయబడుతుంది. హైదరాబాదు, విజయవాడ, మద్రాసు "బి" కేంద్రాల నుండి వినవచ్చు.

సైప్రస్ గ్రామంలో బ్రిటిష్ కాల్పులు

గ్రీక్ విదేశాంగ మంత్రి నిరసన

ఏథెన్స్, జులై 6

అపగొరో అను సైప్రస్ గ్రామములో గోడలమీద బ్రిటిష్ వ్యతిరేక నినాదాలు వ్రాసిన పాయలను వాటిని చెరిపివేయుమని ఆజ్ఞాపింపగా వారు విననందున బ్రిటిష్ రక్షణ దళాలు నిన్న కాల్పులు జరిపాయి. ఇద్దరు చనిపోయారు. పండ్రెండుమంది గాయపడ్డారు.

ఈ సంఘటనపై గ్రీక్ విదేశాంగ మంత్రి ఎవాంగెలోస్ ఎవరాఫ్ నిన్న బ్రిటిష్ రాయబార కార్యాలయానికి తమ ప్రభుత్వ నిరసన తెలిపాడు.

ఆర్ట్స్ మరియు సైన్సు కళాశాల సిద్దిపేట

ఈ కళాశాలలో దిగువ కోర్సులు బోధింపబడును:

పి. యు. సి: సైన్సు: జూయాలజి, బాటని, మరియు కెమిస్ట్రి.
లెక్కలు: లెక్కలు, ఫిజిక్స్ మరియు కెమిస్ట్రి
పి. యు. సి. (ఆర్ట్స్) హిస్టరి మరియు ఎకనమిక్స్
హిస్టరి మరియు సివిక్స్
హిస్టరి మరియు మోడరన్ లాంగ్వేజి.
లెక్కలు మరియు ఎకనమిక్స్.
బి. ఎస్. సి: లెక్కలు, ఫిజిక్స్ మరియు కెమిస్ట్రి.
బాటని,జూయాలజి మరియు కెమిస్ట్రి
బి. ఎ: దిగువ సబ్జెక్టులతో ఈ సంవత్సరము నుండి ప్రారంభించనైనదిః-

(1) హిస్టరి, ఎకనమిక్స్ మరియు మోడర్ లాంగ్వేజి.
(2) ఎకనమిక్స్, పాలిటిక్స్ మరియు హిస్టరి.

బీదలకు మరియుఅర్హతగల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఫ్రీ షిప్పులు ఇవ్వబడును.

సరసమైన రేట్లకు హాస్టల్ సౌకర్యములు దొరుకును.

దరఖాస్తు ఫారములకు మరియు వివరముల కొఱకు 25 న. పైసల స్టాంపులు జతపరచి పంపండి.

ప్రిన్సిపాల్.

వేలం నోటీసు

డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్, సౌత్ చాందా డివిజన్ (బొంబాయి రాష్ట్రము) యందు 1958 ఆగస్టు 6, 7 తేదీలు ఉ॥ 11-0 గం॥ మరియు అవసరమయితే తరువాత రోజులలోను దిగువ చూపబడిన అడవుల వేలం వేయబడును.

(1) చాందాజిల్లా యొక్క ఛాబ, మార్కండ, అహేరి, సిరొంచ మరియు రేవన్‌పల్లి రేంజీలు మరియు నాందేడ్ జిల్లా రాజూర రేంజీల స్టాండింగ్‌కోప్స్.
(2) ఛాబ, అహేరిరేంజీల స్టాండింగ్ బైర్‌కోప్స్.
(3) ఛాబ, మార్కండ, అహేరి, రాజూర మరియు సిరొంచ రేంజులలో ఫోల్డుకోప్స్.
(4) మార్కండ, సిరొంచ, పిర్‌మిల్లి, ఖామ్‌రగ్ర అల్లపల్లి మరియు పిడిగుండం రేంజుల డిపోలాట్లు.
(5) రాజూర మరియు సిరొంచ రేంజుల కొద్దిఫారెస్టుల ఉత్పత్తి.

పూర్తి వివరములకు దిగువ కార్యాలయముతో సంప్రదించండి.

డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్,
సౌత్ చాందా డివిజన్.

6వ సంయుక్త వారము

నేటి బాలురను భావి పౌరులుగా తయారుచేయుటలో బడిపంతుల పాత్రతను చిత్రించిన ఉత్తమగాథ

'బడిపంతులు'

ప్రభాత్ & అలంకార్
హైద్రాబాద్ ఫోన్: 4543. సికింద్రాబాద్ ఫోన్: 6230.

మహాంకాళి జాతరకు అలంకార్ టాకీస్‌లో
నేడు 3 ఆటలు: 2-30; 6-0 మరియు 9-30 గం॥
(BAHAR) చిత్రా డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.

నేటి రాత్రి — నేటి రాత్రి

ప్రతిభా చిత్రం

దొంగలున్నారు - జాగ్రత్త

(తెలుగు)



నటవర్గము :- * జగ్గయ్య, * జి. వరలక్ష్మి, * గిరిజ, * హేమలత, * గుమ్మడి, * చదలవాడ, * సీతారామ్, * రాజనాల, * రమణారెడ్డి, * సి. యస్. ఆర్, * బాలకృష్ణ, * శివరావు.

కమల్ — హైద్రాబాద్. నేడు 2 ఆటలు: 6-00 మరియు 9-30 గం॥
& ప్యారడైజ్ — సికింద్రాబాద్. నేడు 4 ఆటలు; 10-30, 3-00, 6-00 మరియు 9-30 గం॥
రాజరాజేశ్వరి- వరంగల్.
(CIMA) పూర్ణా విడుదల.

జూనియర్ బేసిక్ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం

మంథెన, జులై 5

శ్రీ మెట్రామయ్య కాచేటి కీ॥శే॥ వి. భీమయ్య స్మారకచిహ్నముగ తె. ఎల్. పాఠశాల కొఱకు స్థానికప్రజలచే సమకూర్చబడిన నూతన భవన ప్రారంభోత్సవము జూన్ 29న జరుపబడినది.

ఈ సందర్భమున ఒక ఊరేగింపు జరుపబడిన తరువాత శ్రీ సి. పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశములో శ్రీయుతులు అవధాని వకీలు, జి. శ్రీరాములు (మా జీ ఎం. ఎల్. ఏ), గంగా రాజేశ్వరరావు ప్రసంగించుచు కీ॥ శే॥ వరవాల భీమయ్యగారు మంథెనవారికే గాక ఇతరులెందఱకో ఎన్నియో విధముల సహాయము చేసి సార్థక జన్ములైరని సంస్మరించిరి. పోలీసు చర్య తరువాత శ్రీ బి. రాం కిషన్ రావు మంత్రివర్గములోనున్నప్పుడు వా పి. ఏ గా నుండి అవిభక్త హైదరాబాద్ ప్రభుత్వము తలపెట్టిన విప్లవాత్మక విద్యాసంస్కరణలను ప్రవేశపెట్టుటలో ప్రముఖపాత్రి నవలంబించిరనీ అట్టి నే వాతత్పరుడు, వ్యవసాయశీలునికి ఈ భవనమును మంథెన ప్రజలు స్మారకచిహ్నముగ నెలకొల్పి తమ కర్తవ్యమును కొంతవరకు నిర్వహించిరనీ అభిప్రాయ పడిరి.

భవనప్రకయము కొఱకు కృషి సహాయములుచేసినప్రముఖులు సి. పుల్లయ్య అవధానుల కిష్టయ్య విద్యాసమితి సభ్యులు, బాలమల్లయ్య స. విద్యాశాఖాధికారి, కె. పుల్లారెడ్డి, నరహరి రావు తహసీల్దారు, లంకా విశ్వనాథం బి. డి. ఒ. విఠల్ రావు, హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ స్టాఫ్ మున్నగువారికిని విరాళములొసంగిన వారికిని కృతజ్ఞతలర్పింపబడెను.

ఇదే సందర్భమున శ్రీ ఆర్. మురళీగారి పర్యవేక్షణలో సంగీత కార్యక్రమము మరియు శ్రీ మల్లన్న శాస్త్రిగారి హరికథా కాలక్షేపములు జరుపబడినవి.

రాష్ట్రపతికి పౌర సన్మానం

హైద్రాబాద్, జులై 5

హైద్రాబాద్, సికింద్రాబాద్ కార్పొరేషన్లు జులై 12 వ తేదీన రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాదుకు సమష్టిగా సన్మానపత్రాన్ని సమర్పిస్తాయి.

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ జులై 9న ప్రాంతీయ చేతివృత్తుల శిక్షణ కేంద్రానికి ప్రారంభోత్సవం చేస్తారు. ఆలిండియా చేతివృత్తుల బోర్డు ఏర్పరుస్తున్న యీ కేంద్రంలో మహిళలకు బొమ్మలు, ఆటవస్తువులు, అట్టలుతయారుచేయడం బుక్ బైండింగ్ పేముపనినేర్పుతారు.

నేడే చూడండి

జలరుహా వారి

* రాజనందిని *

తా॥ అంజలీదేవి, జి. వరలక్ష్మి, కృష్ణకుమారి, గిరిజ, రాగిణి, ఎన్. టి. రామారావు, ఆర్. నాగేశ్వరరావు, రేలంగి, గుమ్మడి, రాజనాల, కె. వి. ఎస్. శర్మ, మహంకాళి.

దర్శకత్వం :- వేదాంతం రాఘవయ్య

దీపక్ & రాజేశ్వర్

హైద్రాబాదు. సికింద్రాబాదు.

నేడు 2 ఆటలు: 5-45 మరియు 9-30 గం॥

నేడు 4 ఆటలు: 10-30, 2-30, 6-0 మరియు 9-30 గం॥

త్వరలో: రామా టాకీస్ - వరంగల్.

(Cima) శ్రీ నేషనల్ ఆర్ట్ పిక్చర్స్ రిలీజ్.

కావలెను

ఈ క్రింది స్థలములలో గోలకొండ పత్రికను అమ్ముటకు నమ్మకమైన ఏజెంట్లు కావలెను. పోస్టు ద్వారా గాని రైలు ద్వారా గాని R. T. D. బస్సు ద్వారా గాని పార్సిళ్లు పంపుటకు యేర్పాటుచేయబడును. కోరువారు ఏజెన్సీ నియమములకొరకు వెంటనే వ్రాయగలరు.

1. పర్గి. 2. కొడంగల్. 3. ఇబ్రాహింపటమ్.
4. సదాశివపేట. 5. జోగిపేట. 6. జహీరాబాద్
7. నేలకొండపల్లి. 8. కోదాడ్. 9. హుజూర్ నగరు.
10. మిర్యాలగూడ. 11. వైరా. 12. మధిర.
13. డోర్నకల్. 14. మహబూబాబాద్. 15. ఘనపురం.
16. పర్కాల్. 17. హుజూరాబాద్. 18. మానకొండూర్
19. దేవరకదిర. 20. నారాయణపేట. 21. ముథుల్.
22. బోధన్. 23. సిరిస్పూర్ కాగజ్ నగర్. 24. నాగర్ కర్నూల్
25 అచ్చంపేట. 26. గద్వాల్. 27. కర్నూల్.
28. భాన్సువాడ. 29. ఆర్ మూర్. 30. బెల్లంపల్లి.
31. మెట్ పల్లి. 32. మోర్తాడ్. 33. వేములవాడ.
34. సిరిసిల్లా. 35. పెద్దపల్లి.

గో. ప. మే.

Edited Printed and Published by N. Narotham Redd M A. for the Golkonda Publications Ltd at the Golkonda Patrika Press Hyderabad(A.P)

రేడియో

హైద్రాబాద్

405.4 మీటర్లు (740 కిలోసై)

మంగళవారం, జులై 8

ఉ॥ 6-50 సుప్రభాత్ (భ), కార్యక్రమ వివరణ 7-00 తె-వా, 7-15 మహమ్మద్ ఖాసిమ్ సాహెబ్; క్లారినెట్ (విజయవాడ నుండి రిలే), 7-45 క-వా, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 హిందూస్థానీ సంగీత పాఠము, 8-45 లలిత గాత్ర సంగీతము (భ), 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 మిశ్ర మాధురి (భ), 12-50 మ-వా, 1-00 మహిళా సమాజము గృహసమస్యలు: బీదబంధువులు ప్రసంగం, పనిసులువు నాటిక, వార్తా వాహిని" అమ్మ పిలుస్తూంది, 1-30 వాద్యగోష్ఠి: నిలయ విద్వాంసులు, 1-50 తె-వా, 2-00 శాస్త్రీయ సంగీతము (భ), 2-10 ఉ-వా, 2-20 ఉన్నత పాఠశాలలకు, 2-50 విరామసంగీతము (భ), 3-00 మాధ్యమిక పాఠశాలలకు, 3-30 సంగీతసుధ (భ), 3-45 పాఠశాలలకు (ఉర్దూ), 4-15 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామసీమ, విశేషాలేమిటి? ఉప్పొంగి పోతుంది గోదావరి గేయము, వ్యవసాయగోష్ఠి, ఫిల్మ్‌గీతము (భ), భక్తకవులు; వేమన ప్రసంగము, ప్రకటనలు, ధరలు, వాతావరణము, 7-00 తె-వా, 7-15 గ్రామసీమ పురాణకాలక్షేపము: పిళ్లా వెంకటరత్నం, 7-30 ప్రసంగము (ఉర్దూ), 7-45 శ్రోతలఉత్తరాలకు జవాబులు (ఉర్దూ) 7-50 భక్తిసంగీత్ (భ), 8-00 ఘులాం సిద్దిక్ ఖాన్: రాగ్ నూర్ మల్లార్ విలంబిత్ (తీన్ తాల్) దృత్ (తీన్ తాల్), 8-30 గాయక సమ్మేళనము సంగీత సంచిక నిర్వహణ: విజయమూరి వరదరాజ అయ్యంగార్, 9-00 ఆం-వా, 9-15 ఉ-వా 9-30 దూసరా కినారా నాటిక (ఉర్దూ) రచన; ఘులామ్ జిలానీ, 10-00 ఘులామ్ సిద్దిక్ ఖాన్: రాగ్ మియాకీ మల్‌హార్ విలంబిత్ (ఏక్ తాల్) దృత్ (తీన్ తాల్), 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

విజయవాడ

357.1 మీటర్లు (840 కిలోసై)

ఉ॥ 6-30 భక్తి రంజని, 6-35 ప్రసార తరంగిణి, 6-40 భక్తి రంజని (ఎ-భ) వెంకటాద్రిస్వామి సంకీర్తనలు 7-00 తె-వా, 7-15 మహమ్మద్ ఖాసిం సాహెబ్: క్లారినెట్, 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 1-00 మహిళాసమాజం హైదరాబాద్ నుండి రిలే). 1-40 హిం-వా, 1-50 తె-వా, 2-00 వీణ: నిలయవిద్వాంసుడు, 2-20 ఉన్నతపాఠశాల విద్యార్థులకు, 2-50 వీణ: నిలయ విద్వాంసుడు, 3-00 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రము: కాలమానపద్ధతి ప్రసంగము, హిందీపాఠం, 3-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-50 రాగరసము: దర్బార్ రాగము, 8-00 దత్తాడ పాండురంగరాజు: బాలమురళీకృష్ణ కృతులు, 8-30 సుగమ్ సంగీత్ (భ), 8-45 త్యాగరాజ పంచరత్నకీర్తనలు: బర్బుదగానము, 9-00 ఆం-వా, 9-15 సాహిత్య నందిని స్వీయకవిత కొండవీటి వెంకటకవి, 9-30 ఎ.ఐ.ఆర్ వాద్య బృందము, 10-00 మహ్మద్ ఖానిమ్ సాహెబ్: క్లారినెట్, 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

ఇల్లెందు గీతపారిశ్రామిక సంఘంలో మార్పులు

ఇల్లెందు, జూలై 6

ఖమ్మంజిల్లా ఇల్లెందు గ్రూపు పారిశ్రామిక సంఘసమావేశం జూన్ 27వ తేదీ సాయంత్రం శ్రీ నల్లమాసు మల్లయ్య గృహములో జరిగినది. సమావేశమునకు శ్రీ పి. సూర్యనారాయణ అధ్యక్షతవహించినారు.

గీత పారిశ్రామిక సంఘము ఏర్పడిననాటినుండి యీనాటివరకు జరిపిన కార్యక్రమమును సమీక్షించిన అనంతరం యీ క్రిందివారలతో కూడిన నూతన సంఘమును ఏకగ్రీవముగా ఎన్నుకొనుటజరిగినది— ఖమ్మంజిల్లాలో ప్రప్రథమముగా ఇల్లెందులోనే పారిశ్రామిక సంఘమును ఏర్పరచుకొని సంఘ వ్యవహారములు నడుపుచున్నారు.

నూతన కార్యవర్గము ఇది:-

అధ్యక్షులు గాదె నారాయణ, కార్యదర్శి నల్లమాసు మల్లయ్య, కోశాధికారి వి. రామస్వామి.

సభ్యులు: బుర్రా చిలకయ్య ఇల్లెందుల వెంకటయ్య, పల్లెర్ల రాజయ్య పి. సూర్యనారాయణ, కొప్పుల బుచ్చయ్య, చెట్ల రాఘవులు, కోప్పుల రాజయ్య, ఇల్లెందుల వీరమల్లు.

కాలిఫోర్నియా లోని వాలన్సియాకు చెందిన అమెరికన్ కర్షక సమాఖ్య తాలూకు 70 కుటుంబాలవారు ప్రతినెల ఈ భవనంలో సమావేశమవుతూ ఉంటారు. అమెరికాలోనూ, పోర్టోరికోలోనూ మొత్తం 16,00,000 మంది ఆ సమాఖ్యలో సభ్యులుగా ఉంటున్నారు.

పరిశ్రమల నిర్వహణ: పారిశ్రామిక సంబంధాలు

పారిశ్రామిక పురోభివృద్ధి ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా తదితర అవసరాలు సౌకర్యాల ద్వారా ప్రజల జీవన వ్యయ ప్రమాణాన్ని పెంపొందించడానికి భారతదేశం కంకణం కట్టుకొన్నది. ప్రభుత్వ ప్రయివేటురంగాలు రెంటినీ విస్తృత పరచడానికితల పెట్టబడింది. ఈలక్ష్యాల అంతిమవిజయం పారిశ్రామిక రంగంలోను కార్యకలాపాల నిర్వహణపై ఎక్కువగా ఆధారపడి ఉన్నది. సమర్థమయిన పాలకవర్గంఉన్నప్పుడే ప్రాజెక్టులు ప్రయివేటురంగంలోగాని ప్రభుత్వ రంగంలోగాని విజయవంతమవుతాయి. సాధన సంపత్తిని దుర్వినియోగచేయడం, సమ్మెలు, అశాంతిపరిస్థితులు మన లక్ష్య సాధనకు తీవ్ర ప్రతిబంధకాలు-

వైజ్ఞానికపరిశోధనలను సక్రమంగా వినియోగించడం క్రిందటి శతాబ్దం చివరలో అమెరికాకు చెందిన యస్. డబ్ల్యు. టైలర్ మొదటిసారిగాపారంభించారు. ఉక్కు, ఇంజనీరింగ్, నిర్మాణ పరిశ్రమలలో ఈ ఫలితాలు ఉపయోగించుకోబడినాయి. ఉత్పత్తి విధానాలను, కాలపరిమితిని పరిశీలించి మేలు రకం పనిముట్లను తయారుచేసి ప్రణాళికలను, పద్ధతులను ప్రోత్సహించడం మొదలయినవి ప్రారంభమయినాయి. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో భారీఎత్తున ఉత్పత్తులుఎక్కువ చేయబడినందున వైజ్ఞానిక పరిశోధనా ఫలితాల వినియోగం ఫ్యాక్టరీలకు మాత్రమే పరిమితంగాక విక్రయశాఖ ఆర్థిక నిర్వహణశాఖ, సిబ్బందిశాఖలకు విస్తరింపజేయ బడినాయి. నిర్వహణ శాఖ విషయంలో మేధావులయిన అలివర్ షెల్డన్ (బిటన్), హెన్రీ ఫాయిల్ (ఫ్రాన్సు) తదితర ప్రముఖులు కడు శ్రద్ధాసక్తులను ప్రదర్శించారు. అంతర్జాతీయ వైజ్ఞానిక కలాపాలనిర్వహణ సంఘం ప్రశంసనీయంగా కృషి చేస్తున్నది. 25 దేశాలలోని జాతీయ పాలకశాఖలు ఆసంఘానికి అనుబంధముగా ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచములో పారిశ్రామిక వ్యవస్థ అంటే పెట్టుబడిని వ్యాపారాన్ని కేవలం ఊడించి కార్మికులను లాభసాటిగా వినియోగించుకొని మార్కెటులో గిరాకీగల వస్తువులను ఉత్పత్తి చెయ్యడమే కాదు.

కొలదిసంవత్సరాల క్రిందటఅయితే ఒక వ్యక్తి లేక కొంత మంది వ్యక్తులు కలిసి పరిమితంగా పెట్టుబడి పెట్టి తక్కువ ధరకుకొని ఎక్కువధరకుఅమ్మి లాభాలు సంపాదించడం సాధ్యమయ్యేది. కార్మికుల ఆరోగ్య సౌభాగ్యాలతో యజమానులకు ఎట్టినిమిత్తం వుండేదికాదు. పెట్టుబడిదారుకు లక్ష లాది రూపాయలను ఆర్జించి పెట్టే కార్మికుని యోగక్షేమాలు యజమానికి పట్టేవికావు. గడిచిన 40 సంవత్సరాలలోను పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ఈనాడు పరిశ్రమలనిర్వహణఅనేది అనేక క్లిష్ట సమస్యలతో కూడివున్నది పారిశ్రామిక వాణిజ్య ఆర్థిక వ్యవహారాలు, ఉత్పత్తులను క్రమబద్ధంచేయడం అజ్మాయిషీచేయడం, అవసరమైనముడి వస్తువుల సేకరణవీటన్నింటికంటెకార్మికుల యథేచ్ఛా సహకారాన్ని సాధించడం మొదలైన అనేక విషయాలు న్నాయి. మార్కెటుల వైఖరి, సరుకుకు గిరాకీవున్న దా లేదా అన్న విషయం మార్కెటులో పోటీ అనే విషయాలు అనేకంవున్నాయి. ఉత్పత్తి విధానాలను పెంపొందించడానికి పరిశోధనలు జరిపించాలి.

పరిశ్రమల వర్గీకరణ

పరిశ్రమలను స్థూలంగా నాలుగు వర్గాల క్రింద విభజించవచ్చును. అవి ఇవి: పెద్ద పరిశ్రమలు, ప్రాతిపదిక పరిశ్రమలు, మధ్యరకం పరిశ్రమలు, చిన్న రకం పరిశ్రమలు కుటీర పరిశ్రమలు కూడా పైవాటిలో చేరివున్నాయి. పరిశ్రమల నిర్వహణ సూత్రస్థూలంగా అన్ని పరిశ్రమలకు ఒకటే అయినా, ఒక్కొక్క పరిశ్రమ ఎదుర్కొనే సమస్యల పరిష్కార మార్గం యొక్క వివరాలలో తేడాలుంటాయి. నిజాయితీ, పట్టుదల సానుభూతి విజయవంతంగా పరిశ్రమలను నిర్వహించడానికి అతి ముఖ్యమైనవి. ప్రజల యొక్క విశ్వాసాన్ని కార్మికుల యొక్క సహకారాన్ని వాటాదార్ల సహాయాన్ని పైలక్షణాలద్వారా పొందవచ్చును. శ్రేయోరాజ్య లక్ష్యంతో పరిశ్రమలలోను, వ్యాపారంలోను ప్రభుత్వ జోక్యం ఎక్కువకావడానికి అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ కంట్రోలు అజ్మాయిషీ తప్పనిసరి అయాయి.

ప్రజాస్వామిక దేశంలో అక్రమ వేతనాలు కార్మికుల సౌకర్యాలకొరత వారి పిల్లలకు విద్యాసౌకర్యాల లోటు సహించరానివి. వైసౌకర్యాలు లోపం కావడంతోనే, వాటిని పరిష్కరించడానికి యజమానులు విముఖంగా వున్నప్పుడే సమ్మెలు, లాకౌట్లు సంభవించి యజమానులకు కార్మికులకు సంఘర్షణలు ఏర్పడుతున్నాయి. పరిశ్రమలు తమవన్నభావం కార్మికులకు కలిగినప్పుడు పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. యజమానులు ఇందుకోసం తీవ్రంగా కృషిచేయాలి. కార్మికులు తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించుకోడానికి సమ్మెలు సాధనాలుగా గుర్తించబడింది. అయితే, యూరప్, అమెరికాలలో రాజకీయ కారణాలుగా సమ్మెలు జరుగవు. పరిశ్రమలకు హానికలిగే పద్ధతులలో అసలు జరగవు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఆ దేశాలలో కార్మికోద్యమం సక్రమపంథాలో అభివృద్ధి చెందినందున ఆర్థిక సమస్యలకు, కార్మికుల శ్రేయస్సుకు మాత్రమే అక్కడ సమ్మెలు జరుగుతాయి.

మార్కెటును ఒకరేగుత్త తీసుకునే పద్ధతివల్ల ఆధునిక కాలంలో ప్రయోజనంలేదు. పరిశ్రమలను జయప్రదంగా నిర్వహించి పెట్టుబడికి తగిన లాభాలను సంపాదించడం యీ నాడు పరిశ్రమల నిర్వహణ అనిపించుకోదు. దేశ ఆర్థిక వ్యవస్థను, అంతర్జాతీయ ఆర్థిక సమస్యలను, ముడివస్తువుల ధరలను, విదేశాల కొనుగోలు శక్తిని, రవాణా సౌకర్యాలను, పరిశీలించి తగినట్లుగా వ్యవహరించాలి. ఇట్టిగురుతర కర్తవ్యాన్ని నిర్వహించడానికి వ్యాపార నిర్వహణలో పూర్తిఅయిన సమగ్రమైన శిక్షణ అత్యవసరం."

—శ్రీ బి. పి. సింగ్ రాయ్.

తెలంగాణా ప్రణాళిక 3 కోట్ల హెచ్చింపు

అసెంబ్లీలో మంత్రి శ్రీ వి. బి. రాజు వివరణ

హైదరాబాదు, జులై 6

ఆంధ్రప్రదేశ్ పంచవర్ష ప్రణాళిక గురించి శాసనసభలో అరగంట చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ మొత్తం 175 కోట్ల రూపాయలు. అందులో ఆంధ్రవంతు రు. 120 కోట్లు, తెలంగాణావంతు 55 కోట్లు అని ప్లానింగు శాఖామాత్యులు శ్రీ వి. బి. రాజు వివరించారు. యీరెండు ప్రాంతాలలో అభివృద్ధి సమానంగా జరుగలేదు. మొదటి మూడేండ్ల లో ఆంధ్రలో ఖర్చు 50 శాతం కాగా తెలంగాణాలో 42 శాతం మాత్రమే. తెలంగాణాలో కూడా అదేశాతం ఖర్చు కావాలంటే 1958-59లో ఇంకా 8 శాతం ఖర్చు జరగాలి. అంటే సుమారు 4.5 కోట్లు. యీ మొత్తం యీ సంవత్సరం ఖర్చు చేయటానికి అవకాశం లేదు. 1958-59లో తెలంగాణాలో అదనంగా 3 కోట్లు కేటాయించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. దీనిని ప్రణాళికా సంఘం వారు పరిశీలించారు. వారు ఆమోదిస్తే, తెలంగాణా ప్రణాళిక మొత్తం యీయేడు రు. 9.73 కోట్లనుండి 12.73 కోట్లకు పెరుగుతుంది.

సభ్యులలో ఒకరు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కేటాయింపు తక్కువని సూచించారు. యీ ప్రాజెక్టుకు మొత్తం కేటాయింపు రు. 32.3 కోట్లనీ, మొదటి మూడు సంవత్సరాలలో ఖర్చు సుమారు 18 కోట్లు ఉంటుందనీ, మిగిలిన రెండేండ్లకు రు. 14 కోట్లు ఉన్నదనీ మంత్రిగారు వివరించారు. ప్రణాళికలోని మొత్తం కేటాయింపు నూడేండ్లలో ఖర్చు కావాలంటే మిగిలిన రెండేండ్లు ఏమిచెయ్యాలనే ప్రశ్న ఉదయిస్తుంది- కాబట్టి రాష్ట్ర ప్రణాళిక మొత్తం కేటాయింపు రు. 175 కోట్ల లోనుండే యీ ప్రాజెక్టుకు అదనపు కేటాయింపు జరుగవలసి ఉంటుంది. కేంద్రమే యీ ప్రాజెక్టు నిర్వహణ స్వీకరిస్తే రాష్ట్రప్రభుత్వం వడ్డీలుచెల్లించనవసరం లేదు. యీ విషయం కూడా పరిశీలించబడింది. 1958 మార్చినాటికి రాష్ట్రం 147 కోట్ల రూపాయల ఋణం చేసింది. ఈ సంవత్సరం ఇంకా రు. 29 కోట్లు అప్పు చేయవలసి వస్తుంది. వడ్డీలేని ఋణాలు మంజూరు చేయవలసిందని కేంద్ర ప్రభుత్వమును కోరుతున్నాం.

అనంతరం శ్రీ వి. బి. రాజు రాష్ట్రంలోని పారిశ్రామికాభివృద్ధిని గురించి ప్రస్తావించారు. పెద్దపెద్ద పరిశ్రమలను ఎక్కడ స్థాపించాలనే విషయం భారత ప్రభుత్వపు పారిశ్రామిక విధానం తీర్మానంమీద ఆధారపడిఉంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగింది చాల తక్కువ. అయినప్పటికి ఎక్కడెక్కడ ముడిపదార్థాలు లభించుచున్నవో ఆ ప్రాంతాలలో పరిశ్రమలను నెలకొల్ప జేయుటకై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది. ఎరువుల ఫ్యాక్టరీ, స్టీల్ రోలింగ్ మిల్ మొదలయినవాటి యీ విషయములో యీ విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేసింది. సహకార పంచదార ఫ్యాక్టరీల వంటి మధ్యతరహా పరిశ్రమలలో సేరుధనంపోగు చేయటంలో కొంత ఇబ్బంది ఉంది. అన్ని యిబ్బందులను అధిగమించటానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముఖ్యంగా వ్యావసాయిక రాష్ట్రం. పారిశ్రామికాభివృద్ధిలో అందువల్ల చెప్పుకో తగినంత పనిజరుగక పోయినా వ్యవసాయం కొరకు విద్యుచ్ఛక్తిని వినియోగించుకునే ఏర్పాటును చిన్న చూపు చూడటానికి వీల్లేదు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి విద్యుచ్ఛక్తి పద్దు కింద రు. 27.59 కోట్లు కేటాయించబడినది. మొదటి మూడు సంవత్సరాల్లో ఖర్చు సుమారు రు- 18.6 కోట్లు. మిగిలిన రెండేండ్లకు రు. 10 కోట్ల కేటాయింపు యింకా వున్నది. అనంతరం మంత్రిగారు ఆర్థికావకాశాలను గురించి చర్చిస్తూ మొదట్లో యున్న పద్ధతి ప్రకారం రాష్ట్రం కేంద్రప్రభుత్వాలు ఖర్చులో భరించవలసినది 4.7 నిష్పత్తిలో ఉండేదని వివరించారు 1957-58, 58-59 సంవత్సరాలలో నిష్పత్తి 2:3. యీ అదనపు ఖర్చును తట్టుకోటానికి రాష్ట్ర ప్రభుత్వం సాయశక్తులా కృషిచేస్తున్నది. ప్రణాళికా సంఘం రాష్ట్ర ప్రణాళికలు పునఃపరిశీలించవలసిందని కోరినది. యీ పునఃపరిశీలన ప్రతిపాదనలు వివిధ ప్లానింగు కమిటీలలో నుంచి రాష్ట్ర సలహా సంఘంలోను చర్చించ బడగలవని ఆయన సూచించారు.

సెప్టెంబర్, అక్టోబర్ పరీక్షలు

హైద్రాబాద్, జూలై 6

ఉస్మానియా విశ్వవిద్యాలయాల ఆధ్వర్యాన జరిగే 1958 సెప్టెంబరు-అక్టోబరు పరీక్షలకు హాజరు కాగోరు విద్యార్థులు పరీక్ష రుసుం చెల్లించవలసిన తుది గడువు జూలై 7వ తేదీ సోమవారం అని గమనించవలెను. ఆనాటివరకు లేటు ఫీజు ఉండదు. జూలై 14వ తేదీ సోమవారం వరకు రోజుకు రూపాయివంతున లేటు ఫీజు చెల్లించి కూడా రుసుం పంపించవచ్చు.

ప్రభుత్వ వేలములు

హైద్రాబాద్, జూలై 6

ప్రభుత్వఉద్యోగుల ప్రవర్తన నియమావళిలోని 9వ నిబంధన క్రిందగల 10వ ఉపనిబంధన బదులు దిగువ నిబంధన చేయబడింది.

10 రాష్ట్ర ప్రభుత్వానుమతితో తప్ప, ప్రభుత్వోద్యోగులు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగాగానీ, ఏ ప్రభుత్వ శాఖవల్లనైనా జరిగే వేలములలో పాల్గొనరాదు. స్థిరచరాస్తులకు ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వం స్వాధీన పరచుకున్న ఆస్తుల వేలములకు ఇది వర్తిస్తుంది.

ఇల్లెందు తాలూకా ప్రజల అవసరాలు

గవర్నరుకు, ముఖ్యమంత్రికి శ్రీ దమ్మిలాల్ మెమోరాండం

ఇల్లెందు, జూలై 6

ఇల్లెందు తాలూకా బీదప్రజల సహాయార్థము ప్రభుత్వము బియ్యం, జొన్నలు వగైరా తిండిగింజలకై చౌకడిపోలు పెట్టవలయునని లొగ్గనులు వుండుటచేత ఇల్లెందు గ్రామము చాల ప్రాముఖ్యము వహించుచున్నది. కాబట్టి ఇల్లెందు నుండి ఖమ్మం, మహబూబాబాద్ గ్రామాలకు వెళ్లే రోడ్లను పక్కా రోడ్లుగా మార్చవలయునని, రోళ్ళపహాడు చెర్వును మరమ్మతు చేయించుమని డోర్నకల్ భద్రాచలం రోడ్డు, కొత్తగూడెం ఇల్లెందు రైల్వే స్టేషన్‌లలో [illegible] జరు చెడ్డను వేయించుమని [illegible] డీకులరద్దీ అధికంగా వు[illegible] మరికొన్ని లోకల్ బండ్లు యనని ఇల్లెందు తాలూకా [illegible] గెను అధ్యక్షుడు శ్రీ దమ్మిలాల్ చౌరస్యా ఒక ప్రకటన చేస్తున్నారు. వీరు యీ కోర్కెలను మెమోరాండాలద్వారా ముఖ్యమంత్రికి, గవర్నరుకు కూడా వివరించినారు. గవర్నరు ముఖ్యమంత్రులు యీ విషయంలో శ్రద్ధతైకొనగలమని చెప్పినట్లు తెలుస్తున్నది.

వనమహోత్సవము

శంకర్‌పల్లి, జూలై 6

శంకరంపల్లి గ్రామంలో జులై 1న వనమహోత్సవము కడు వైభవముగా జరుపబడినది. ఉదయము ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతపాఠశాలల విద్యార్థులు దాదాపు మూడు వందల మంది తమతమ హస్తములయందు మొక్కలను ధరించి వనమహోత్సవ నినాదములను చేయుచు ఊరేగింపు జరిపిరి. మొక్కలు నాటిన పిమ్మట శ్రీ సాదు సోమప్ప అధ్యక్షతన బహిరంగసభ జరుపబడెను. కొత్తగాఏర్పడిన "పంచాయతీ సమితుల" ప్రాముఖ్యమును వివరించి మెదకుజిల్లాయందలి మొదటి "సమితిని" ప్రభుత్వమువారు ఈప్రాంతమునే యేర్పరచినందుకు అభినందిస్తూ సభలో ప్రసంగాలు జరిగినవి.

సాయంత్రము బాలబాలికలచేఆటల పోటీలు నిర్వహించబడెను. గెలుపొందినవారికి బహుమతులనిచ్చుచు పిల్లలందరకు మిఠాయీలు పంచిరి. ఆర్. వి. సింగు వందన సమర్పణతో కార్యక్రమము సమాప్తమైనది.

కావలెను

1. నల్లగొండ. 2. నిజామాబాద్.
3. ఖమ్మంమెట్టు. 4. కరీంనగరం.
5. మెదక్. 6. ఆదిలాబాద్

జిల్లాల ప్రధాన స్థలముల నుండి వార్తలను పంపుటకు అనుభవము గల విలేఖరులు కావలెను. నియమములను వెంటనే వ్రాయండి.

మేనేజర్

గోలకొండ పత్రిక.